www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
TELUGU DAILY
www.mudranews.in
@mudranews
mudratv
సంపుటి : 13
సంచిక : 101
పేజీలు : 12
వెల : రూ. 5
హైదరాబాద్, శుక్రవారం, 30.01.2026



# అమ్మ వచ్చిందీ..!

## గద్దెనెక్కిన సమ్మక్క

- సమ్మక్క-సారలమ్మల నామస్మరణతో పులకించిన మేడారం
- అశేష భక్తజనానికి వనదేవతల ఆశీస్సులు
- అధికార లాంఛనాలతో సమ్మక్కకు స్వాగతం
- చిలకలగుట్ట నుంచి మేడారం వరకు మూడంచెల భద్రత
- గద్దెలపై కొలువుదీరిన వనదేవతలు
- అపురూపఘట్టం ఆవిష్కృతం

ముద్ర, తెలంగాణ బ్యూరో :

మేడారం జాతరలో మొదటి రోజు సారలమ్మ గద్దెపై కొలువుతీరింది. రెండో రోజు సమ్మక్క ఆగమనంతో ప్రాంగణం మొత్తం జనసంద్రమైంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతర మేడారం సమ్మక్కసారలమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. కోట్లాది భక్తుల ఆరాధ్య దైవాలైన వనదేవతల కొలువుతో ములుగు జిల్లాలో ఉన్న అటవీప్రాంతం జనసంద్రమైంది. జనవరి 28 బుధవారం సాయంత్రం సారలమ్మ గద్దెపై కొలువుదీరడంతో జాతరకు అంకురార్పణ జరిగింది. భక్తుల జయజయధ్వానాలు, ఆదివాసీ వాయిద్యాల హోరు మధ్య మేడారం పులకించిపోయింది. మిగతా 2లో

## ఇప్పటివరకు 80 లక్షల మంది దర్శనం



- సమ్మక్క గద్దె సమయానికి కోటికి మించే అవకాశం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2




# కేసీఆర్ కు సిట్ నోటీసులు!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు
- హైదరాబాద్ నందినగర్ లో ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేత
- విచారణ వాయిదా వేయాలని సిట్ ను కోరిన కేసీఆర్

ముద్ర, తెలంగాణ బ్యూరో :

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్నట్టే.. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు ఇచ్చింది. కేసు విచారణలో భాగంగా క్షేత్రస్థాయిలో ఆధారాలను సేకరించిన సిట్ అధికారులు.. చివరకు కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించింది. ఈ మేరకు సిట్ అధికారులు గురువారం నేరుగా హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి ఆయన పీఏకు నోటీసులు అందజేశారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్లు పైబడిన దృష్ట్యా కేసీఆర్‌కు విచారణ సమయంలో స్టేషన్ హాజరు ప్రత్యేక మినహాయింపునిచ్చారు. జూబ్లీహిల్స్ స్టేషన్‌కు రావొచ్చు లేదంటే.. హైదరాబాద్‌లోని మరో ప్రాంతాన్ని సూచించవచ్చునని ఆ నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. ఫోన్ మిగతా 2లో

## కేసీఆర్ కు నోటీసులు దుర్మార్గపు చర్య



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విచారణ పేరిట ప్రతీకారం
- అసమర్థ కాంగ్రెస్ కు ప్రజలే బుద్ధి చెబుతారు

2

## ఫోన్ ట్యాపింగ్ కారకులను శిక్షించాల్సిందే



- జాగృతి అధ్యక్షురాలు కవిత
- ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు

2

## రాజకీయ కక్షతోనే కేసీఆర్ కు నోటీసులు



- మాజీ మంత్రి హరీశ్ రావు
- ప్రజావ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకే సర్కార్ సిట్ డ్రామా

3

## కేసీఆర్ కు నోటీసుల వెనక రాజకీయ దురుద్దేశం లేదు



- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- సిట్ విచారణ పారదర్శకంగా జరుగుతోంది
- కేసీఆర్ కు నోటీసులు దర్యాప్తులో భాగమే

3

## స్పీకర్ నుంచి పిలుపు రాలేదు

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం
- పార్టీ ఫిరాయింపు నోటీసులపై నా న్యాయవాది స్పీకర్ కు లేఖ రాశారు
- బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేయలేదు
- ఉప ఎన్నిక వచ్చినా భయపడను

3





## ఈయూతో ఒప్పందం చారిత్రాత్మకం

- ప్రపంచానికి భారత్ ఆశాకిరణం
- వికసిత్ భారత్" లక్ష్యం
- భారత్ వైపు అన్ని దేశాల చూపు
- సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదు
- ప్రధాని నరేంద్ర మోదీ

10

# కాంగ్రెస్ లో టికెట్ ఫైట్

- అధికార పార్టీలో 'అభ్యర్థుల' మథనం
- గెలుపు గుర్రాల వేటలో అధిష్ఠానం!
- తుమ్మల మార్క్ సర్వేతో నేతలకు షాక్!
- సర్వే రిపోర్టుల అస్త్రం: స్థానిక నేతలకు మంత్రి తుమ్మల చెక్!
- గెలుపు గుర్రాల వేటలో గందరగోళం.. 39 డివిజన్లకే గ్రీన్ సిగ్నల్!
- ఢిల్లీ లెవల్ లో స్కెచ్.. గల్లీలో ఫైట్
- పీసీసీ, సీఎంవోకు చేరిన జాబితా...
- నేడో, రేపో మిగతావి ఖరారు...
- ముగ్గురు మంత్రుల నిర్ణయమే కీలకం
- సీఎంవో గడప తొక్కిన అభ్యర్థుల జాబితా!
- బీ-ఫామ్ గడువు సమీపిస్తున్నా వీడని చిక్కుముడి
- ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్!



6



## మేడారంలో 108 బైక్ అంబులెన్స్‌ల ఏర్పాటు

- ఫస్ట్ రెస్పాండర్ గా అందుబాటులోకి..
- భక్తుల భద్రతకు 40 మొబైల్ అంబులెన్స్‌ల ఏర్పాటు

3

## ఇక ఆఖరి మోఖా

- కేసీఆర్ కు చేరిన సిట్ నోటీస్.. రాజకీయాల్లో హీట్
- జనవరి 30 విచారణపై ఉత్కంఠ
- ఎన్నికల వేళ నోటీసుల కలకలం.
- హాజరవుతారా? వాయిదా కోరతారా?
- ప్రభుత్వం vs బీఆర్ఎస్ మాటల యుద్ధం.
- ఆత్మగౌరవ పోరాటంగా బీఆర్ఎస్ కౌంటర్
- తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు

2




- హార్వర్డ్ వేదికగా యువతకు సీఎం రేవంత్ పిలుపు

10

## తెలంగాణ విద్యా ముఖచిత్రాన్ని మారుద్దాం..

ఇదీ ఏఐ ముద్ర

మేడారంలో గద్దె నెక్కిన సమ్మక్క.. పులకించిన జనం



## బీజేపీ బీసీ వ్యతిరేకి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- 2011లో కాంగ్రెస్ చేసిన తప్పే బీజేపీ చేస్తోంది
- బీజేపీ కుట్రను బీఆర్ఎస్ ఖండించలేదు
- జనగణనపై కేంద్రానికి నివేదిక ఇస్తాం

3





10

## డేంజర్ లో మేడిగడ్డ

- అత్యంత ప్రమాదకర స్థితిలో బ్యారేజ్
- పార్లమెంట్ లో వెల్లడించిన కేంద్రం

## మా బాస్.. కేసీఆర్

- ఎంపీ ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు
- యథాలాపమా? ఉద్దేశపూర్వకమా?



10



## కేంద్ర ఆర్థిక సర్వే: కేసీఆర్ పాలనకు గుర్తింపు

- సాగు భూమి విస్తీర్ణంలో కోటి ఎకరాల భారీ పెరుగుదల!
- తొమ్మిదేళ్లలో 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.21 కోట్ల ఎకరాలకు సాగు భూమి విస్తరణ
- కాళేశ్వరం, మిషన్ కాకతీయ ప్రాజెక్టులే వ్యవసాయ అభివృద్ధికి ప్రధాన బలం
- వ్యవసాయంతో పాటు ఐటీ, తయారీ రంగాల్లోనూ తెలంగాణ దూసుకుపోతున్న రాష్ట్రం

9

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మేడారం జాతర విశేషాలు**
ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర: మేడారం జాతర ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందింది, దీనికి కోట్లాది మంది భక్తులు తరలివస్తారు.



# అమ్మ వచ్చిందీ..!

(మొదటి పేజీ తరువాయి)
మేడారం మహాజాతర ప్రారంభానికి వారం ముందే భక్తులు మొక్కులు చెల్లించుకుంటూ జాతర ప్రాంతానికి తరలివచ్చారు. మొదటి రోజు సారలమ్మ రాకను చూసేందుకు కుటుంబాలతో భక్తులు పెద్దఎత్తున చేరుకున్నారు. కన్నెపల్లి ఆలయంలో ఉదయం నుంచే పూజలు నిర్వహించి, సాయంత్రం పసుపు-కుంకుమలను వెదురు బుట్టలో పెట్టి మేడారానికి తీసుకొచ్చారు. “వరం పట్టడం” అనే భక్తి ప్రక్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంతాన భాగ్యం, కోరికల నెరవేర్చుకోసం మహిళలు ఆలయ మెట్ల నుంచి మోకరిల్లగా, పూజారులు అమ్మవారిని మోస్తూ వారిపై నుంచి నడిచిన దృశ్యాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచాయి. జంపన్న వాగు దాటి సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠించారు. పగిడిద్దరాజు పెళ్లికొడుకులా అలంకరించుకుని పూనుగొండ్ల నుంచి కాలినడకన మేడారానికి చేరుకుని సమ్మక్క రాక కోసం వేచిచూశారు. అనుకోని కారణాలతో సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల ప్రతిష్ఠ ఆలస్యమై రాత్రివేళ రహస్యంగా పూర్తిచేశారు. జాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన సమ్మక్క ఆగమనం గురువారం సాయంత్రం జరిగింది. చిలుకలగుట్టపై రహస్య పూజల అనంతరం కుంకుమ భరిణ రూపంలో సమ్మక్కను వెదురు బొంగులో తీసుకొచ్చారు. అధికార లాంఛనాల మధ్య గద్దెపై ప్రతిష్ఠించగా భక్తులు కోళ్లు, మేకలు బలిస్తూ పూనకాలతో ఊగిపోయారు. మొదటి రోజే లక్షలాది మంది తరలిరావడంతో రవాణా, పార్కింగ్ ప్రాంతాలు నిండిపోయాయి. భక్తుల భద్రత కోసం వేలాది మంది పోలీసులు, సిబ్బంది విధుల్లో ఉన్నారు. వనదేవతల దర్శనంతో మేడారం అంతా భక్తినాదాలతో మార్మోగింది. కోయదొరల డప్పులు, డోలు వాద్యాల మధ్య సమ్మక్క-సారలమ్మ గద్దెలపై కొలువుదీరగా భక్తులు ఎత్తుబంగారం, ఒడిబియ్యం సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. గురువారం ఒక్కరోజే భక్తుల సంఖ్య కోటి దాటిందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేయడంతో మేడారం విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటోంది. ఎల్ఈడీ స్క్రీన్లు, లేజర్ షోలు ఆకట్టుకుంటున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుండగా వేలాది వాహనాల రద్దీ కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు అమ్మవార్లను దర్శించి నిలువెత్తు బంగారం సమర్పించారు. మూడో రోజు వనదేవతలందరూ గద్దెలపై దర్శనమివ్వనుండగా, రెండు రోజుల పూజల అనంతరం తిరిగి అడవికి వెళ్లనున్నారు. మహాజాతరలో వనదేవతల దర్శనంతో భక్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.


చిలకలగుట్ట నుండి. 6 గంటల..55 నిమిషాలకు గద్దె ల మీదకి బయలు దేరిన సమ్మక్క



## ఇప్పటివరకు 80 లక్షల మంది దర్శనం

- సమ్మక్క గద్దె సమయానికి కోటికి మించే అవకాశం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల రద్దీ భారీగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు ఐ&పీఆర్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు సుమారు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దె సమయానికి ఈ సంఖ్య కోటిని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటు ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

**మేడారం శాశ్వత అభివృద్ధి**
జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమి సేకరణ పూర్తైందని, మరో 41 ఎకరాలు సేకరణలో ఉన్నాయని మంత్రి తెలిపారు. మొత్తం 70 ఎకరాల్లో కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరుగుదొడ్లు, స్నాన గదులు వంటి శాశ్వత సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

**టెంపుల్ సర్క్యూట్ – జంపన్నవాగు అభివృద్ధి**
బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్లతో టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా రామప్ప-లక్నవరం నుంచి పైప్‌లైన్ ప్రాజెక్టు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మేడారం ప్రాంతానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, రోడ్లు, ఎకో పార్కులు, పర్యాటక సదుపాయాలు విస్తరించనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి రెండు రోజుల్లోనే 70-80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని తెలిపారు. ఫోర్‌లేన్ రోడ్లతో రాకపోకలు సులభమయ్యాయని, భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థ, మరుగుదొడ్లు, చెట్ల పెంపకం అవసరమని సూచించారు. జాతర విజయవంతానికి సహకరించిన అధికార యంత్రాంగం, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి వనప్రవేశం చేయనున్నందున, అప్పటి వరకు భక్తులు ఓపికగా దర్శనం చేసుకోవాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.



# కేసీఆర్ కు సిట్ నోటీసులు!




(మొదటి పేజీ తరువాయి)
ట్యాపింగ్ వ్యవహారంలో ఉన్న సందేహాలు, ఆధారాలపై వివరణ ఇవ్వాలని సిట్ అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ అగ్రనేతలను సిట్ విచారించింది. మాజీ మంత్రి హరీష్ రావు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ ఎంపీ సంతోష్ రావులను ఇప్పటికే సిట్ అధికారులు ప్రశ్నించారు. వీరి నుంచి సేకరించిన వివరాలు, అలాగే ప్రస్తుతం జైలులో ఉన్న పోలీసు అధికారుల వాంగ్మూలాల ఆధారంగా కేసీఆర్‌ను విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో నిఘా పరికరాల వినియోగం, రాజకీయ నేతల ఫోన్ల నిఘాపై ప్రధానంగా ఈ విచారణ సాగనున్నది. ఇదిలావుంటే సిట్ అధికారులు.. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తున్నాయి. రాజకీయ కక్ష సాధింపుతోనే కాంగ్రెస్ సర్కార్ నోటీసులు జారీ చేసిందని ఆరోపిస్తున్నారు. మరోవైపు నేటి సిట్ విచారణకు కేసీఆర్ సహకరిస్తారా..? లేదా..? ఒకవేళ సహకరిస్తే సిట్ అధికారులు ఆయనపై ఎలాంటి ప్రశ్నలు సంధిస్తారు.? వాటికి కేసీఆర్ ఎలాంటి సమాధానాలు ఇస్తారు? కేసీఆర్ విచారణ తర్వాత సిట్ ఎలాంటి చర్యలు తీసుకోబోతోంది...? అనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

**అసలేంటీ ఫోన్ ట్యాపింగ్ కేసు ..?**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, పౌరుల ఫోన్లను నిబంధనలకు విరుద్ధంగా పర్యవేక్షించారనే ఆరోపణలపై ఈ కేసు సాగుతోంది. ఇంటెలిజెన్స్ విభాగంలోని ఎస్ఐబీ టీం ద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం, ఎన్నికల సమయంలో నిధుల తరలింపును గమనించేందుకు సుమారు 1200 మందికి పైగా అక్రమ నిఘా ఉంచినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సాక్ష్యాధారాలను రూపుమాపేందుకు హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే డీఎస్పీ ప్రణీత్ రావుతో పాటు పలువురు ఉన్నత స్థాయి పోలీస్ అధికారులను సిట్ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ విచారణ మాజీ సీఎం కేసీఆర్ సహా కీలక రాజకీయ నేతల చుట్టూ తిరుగుతోంది.

**భగ్గుమన్న గులాబీ శ్రేణులు..**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు సిట్ నోటీసులివ్వడాన్ని బీఆర్ఎస్ తో పాటు.. ఆ పార్టీ విద్యార్థి అనుబంధ విభాగం బీఆర్ఎస్వీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విద్యార్థి విభాగం నాయకులు సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఓయూలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మాజీ సీఎం, ఉద్యమ నేత కేసీఆర్‌కి నోటీసులు ఇవ్వడం అంటే.. తెలంగాణ ప్రజలకు ఇవ్వటమే అని ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నేతలు సిట్‌పై మండిపడ్డారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయని వ్యక్తి కేసీఆర్.. అలాంటి వ్యక్తిని రాజకీయ లబ్ధి కోసం సిట్ నోటీసులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. తెలంగాణ భవన్‌కు చేరుకున్న బీఆర్ఎస్ నేతలు రోడ్డుపై నిరసన తెలిపారు. భవన్ దగ్గరలోని అగ్రసేన్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ప్రభుత్వానికి, సీఎంకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**విచారణ వాయిదా వేయండి : కేసీఆర్**
ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు సంబంధించి సిట్ జారీ చేసిన నోటీసులపై మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్పందించారు. గురువారం రాత్రి సిట్ అధికారులకు లేఖ రాసిన ఆయన, ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నందున నేటి విచారణకు హాజరు కాలేనని తెలిపారు. తనకు కొంత గడువు ఇవ్వాలని కోరుతూ, అవసరమైతే ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌లోనే విచారణ జరపవచ్చని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక విచారణకు పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టు దర్యాప్తులోనూ గతంలో గడువు కోరిన కేసీఆర్‌కు కమిషన్ సమయం ఇచ్చిన నేపథ్యంలో, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇక ఆఖరి మోఖా

ముద్ర, తెలంగాణ బ్యూరో :
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. హాజరవుతారా లేదా అన్నదానిపై ఇంకా బీఆర్ఎస్ ప్రకటన చేయలేదు. తెలంగాణను దశాబ్ద కాలం పాటు పాలించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించింది. ఈ నెల 30న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని అధికారులు కోరారు. అయితే, ఆయన వయస్సు రీత్యా సెక్షన్ 160 CrPC ప్రకారం విచారణ ఎక్కడ జరగాలనేది ఎంచుకునే వెసులుబాటును పోలీసులు కల్పించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గానీ లేదా ఆయనకు అనువైన మరో ప్రదేశంలో గానీ విచారణకు సహకరించవచ్చని ఆఫర్ ఇచ్చారు. ఇప్పుడు అందరి దృష్టి కేసీఆర్ నిర్ణయంపైనే ఉంది. ఆయన స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన నిరసనను మౌనంగానే చాటుతారా, లేక ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో అధికారులను కలవాలని నిర్ణయించుకుంటారా అనేది ఉత్కంఠగా మారింది. అయితే హైదరాబాద్ పరిధిలోనే విచారణకు రావాల్సి ఉంటుందికాబట్టి ఫామ్ హౌస్ లో కుదరదని.. బీఆర్ఎస్ భవన్ లేదా ..నందినగర్ నివాసం ఏదైనా ఎంచుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

**విచారణకు హాజరవుతారా? వాయిదా కోరతారా?**
సాధారణంగా ఇలాంటి కీలక కేసుల్లో విచారణకు హాజరై తమకేమీ తెలియదని సమాధానం చెప్పడం ద్వారా ఆ ప్రక్రియను ముగించాలని నాయకులు భావిస్తుంటారు. ఇప్పటికే హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ రావు వంటి నేతలు సిట్ ముందుకు వెళ్లి సుదీర్ఘంగా సమాధానాలిచ్చారు. అయితే కేసీఆర్ ఒక అడుగు ముందుకు వేసి, పోలీసుల మినహాయింపులను పక్కన పెట్టి నేరుగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కే వెళ్లే అవకాశం లేకపోలేదు. తద్వారా ప్రభుత్వం తనను వేధిస్తోందనే పొలిటికల్ విక్టిమ్ కార్డును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. ఒకవేళ ఆరోగ్య కారణాలు లేదా ఇతర విచారణల దృష్ట్యా వాయిదా కోరితే, అది ప్రభుత్వం చేతికి అస్త్రం ఇచ్చినట్లవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ ఫోన్ ట్యాపింగ్' అస్త్రం
తెలంగాణలో ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ నడుస్తోంది. ఈ సమయం ఈ నోటీసులు రావడం యాదృచ్ఛికం కాదని బీఆర్ఎస్ నేతల వాదన . గత ప్రభుత్వ హయాంలో వేలాది ఫోన్లు ట్యాప్ అయ్యాయని, ఆ వ్యవహారం వెనుక పెద్దాయన ఉన్నారనే ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళ్లాలని చూస్తోంది. ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం వంటి ఇతర అంశాలపై ప్రతిపక్షం చేస్తున్న దాడిని తిప్పికొట్టడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ కేసును పదునైన ఆయుధంగా వాడుకుంటోంది. విచారణ పేరుతో కేసీఆర్‌ను ఇరకాటంలో పెట్టడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌ను నైతికంగా దెబ్బతీయవచ్చనేది అధికార పక్షం వ్యూహంగా కనిపిస్తోంది.

**ఆత్మగౌరవ పోరాటంగా బీఆర్ఎస్ కౌంటర్**
మరోవైపు, బీఆర్ఎస్ శ్రేణులు ఈ నోటీసులను 'తెలంగాణ ఆత్మగౌరవం'పై జరిగిన దాడిలా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయి. స్వరాష్ట్ర కాంక్షను నెరవేర్చిన నాయకుడిని నేరస్థుడిలా విచారించడం అంటే తెలంగాణను అవమానించడమేనని హరీష్ రావు వంటి నేతలు గట్టిగా వాదిస్తున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఈ కక్షసాధింపు చర్యలకు ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నారు. అటు ప్రభుత్వం తన దర్యాప్తు సంస్థల ద్వారా 'కుట్ర కోణాన్ని' బయటపెట్టాలని చూస్తుంటే, ఇటు బీఆర్ఎస్ దీనిని రాజకీయ వేధింపుల పర్వంగా మలిచి సానుభూతి పొందేందుకు సిద్ధమవుతోంది. మొత్తంమీద, జనవరి 30వ తేదీ తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపు కాబోతోంది.

## కేసీఆర్ కు నోటీసులు దుర్మార్గపు చర్య

ముద్ర, తెలంగాణ బ్యూరో :
ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరని చెప్పారు. ప్రత్యేక ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని కేటీఆర్ ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. అడ్డగోలు హామీలు... అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే విచారణల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వ పెద్దలు, సిట్ అధికారులు చెబుతున్నట్లు ఫోన్ ట్యాపింగ్ పేరిట జరుగుతున్నది విచారణ కాదన్నారు. ఇది ముమ్మాటికీ అధికార పార్టీ ప్రతీకార చర్య అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్ష నేతలను వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.



ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్.... తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు గ్రహించాలన్నారు. తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్ అన్నారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళిత బంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్ అని కొనియాడారు.



## ఫోన్ ట్యాపింగ్ కారకులను శిక్షించాల్సిందే

ముద్ర, హైదరాబాద్ :
గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బాధాకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. దాని వెనక ఉన్న వారికి శిక్షపడాల్సిందేనని చెప్పారు. గురువారం జూబ్లీహిల్స్ లోని ఖాజా మెన్షన్ లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ఉన్నందునే ప్రభుత్వం సిట్ అధికారులతో కేసీఆర్ కు నోటీసులు ఇప్పించిందన్నారు. ఈ కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా లేదన్నారు. ఈ కేసు విషయంలో ప్రభుత్వం ఉద్దేశం ఏంటో ఎవరికీ అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. విచారణను వేగవంతం చేసి... త్వరగా కేసును పూర్తి చేయాలని సిట్ అధికారులను కోరారు. అయితే ఫోన్ ట్యాపింగ్ నేరస్తులకు శిక్ష పడుతుందా.? లేదా.? అని వేచి చూడాల్సిందేనన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 30.01.2026
www.mudranews.in | @mudranews



**మేడారం జాతర విశేషాలు**

**రెండు ఏళ్లకు ఒకసారి:** ఈ మహా జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘ మాసంలో పౌర్ణమి రోజుల్లో అత్యంత వైభవంగా జరుగుతుంది.




## రహదారి ఆక్రమణలను తొలగించిన హైడ్రా

**ముద్ర, హైదరాబాద్ :**
రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దంబర్‌పేట గ్రామంలో ఉన్న శబరి హిల్స్ లేఔట్‌లో రహదారులను ఆక్రమించి నిర్మించిన ప్రహరీలను హైడ్రా గురువారం తొలగించింది. సర్వే నంబర్ 265లో 278 ప్లాట్లతో ఏర్పాటైన ఈ లేఔట్‌కు ఆనుకుని సర్వే నంబర్ 346లో ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి, లేఔట్‌లోకి చొరబడి సుమారు 20 ప్లాట్ల మేర ఆక్రమణకు పాల్పడినట్లు గుర్తించారు. తన భూమి గుండా నాలా ప్రవహిస్తోందని పేర్కొంటూ ఆ స్థలం తనదేనంటూ రహదారులపై ప్రహరీ నిర్మించారు. దీంతో లేఔట్‌కు వెళ్లే ప్రధాన దారి మూసుకుపోయిందని శబరి హిల్స్ లేఔట్ ప్లాట్ యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో హైడ్రా అధికారులు విచారణ చేపట్టి, ఇరుపక్షాల సమక్షంలో ఏడీ సర్వే నిర్వహించి హద్దులను ఖరారు చేశారు. విచారణలో లేఔట్‌లోకి సుమారు 4వేల గజాల మేర ఆక్రమణ జరిగినట్లు నిర్ధారణ కావడంతో, రహదారులకు అడ్డుగా ఉన్న ప్రహరీలను తొలగించారు. హైడ్రా చర్యతో లేఔట్‌లోని రహదారులు పునరుద్ధరించబడటంతో శబరి హిల్స్ నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు.

## తక్షణ వైద్యసేవలకు మేడారంలో
# 40 బైక్ అంబులెన్స్‌లు

**మీడియా సెంటర్, మేడారం:**
శ్రీ సమ్మక్క–సారలమ్మ మేడారం మహా జాతర సందర్భంగా భక్తులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్ సేవలను విస్తృతంగా ఏర్పాటు చేసింది. మేడారం జాతర ప్రాంతమంతటా మొత్తం 40 ఫస్ట్ రెస్పాండర్ 108 బైక్ అంబులెన్స్‌లను వివిధ కీలక ప్రాంతాల్లో మోహరించారు. భారీ రద్దీ ఉన్న ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకుని వైద్య సహాయం అందించేందుకు వీలుగా ఈ బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మొబైల్ 108 సేవల ద్వారా జ్వరం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి స్వల్ప ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న భక్తులకు తక్షణ ఫస్ట్ ఎయిడ్‌తో పాటు అవసరమైన ప్రాథమిక మందులు అందిస్తున్నారు. అలాగే, పరిస్థితి విషమంగా ఉన్న సందర్భాల్లో భక్తులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. జాతర కాలమంతా ఈ సేవలు నిరంతరంగా అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. భక్తుల భద్రత, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చర్యలు చేపట్టింది.




## కదిలించిన 'పాట'కు సత్కారం



హృదయాలను కదిలించేది.., భావోద్వేగాలను పలికించేది.. ఆలోచింపజేసేది.. ఒక్క పాటే.. ఆ పాటకు ఎంత బలముంటుందో.. ఆ పాట మనిషి అంతరంగాన్ని, సమాజ స్థితిగతులను ప్రతిబింబింపజేస్తుంది.., జీవిత సత్యాలను చాటిచెబుతుంది.. ఒక్కసారి తెలంగాణ ఉద్యమంలోకి తొంగి చూస్తే అర్థమవుతుంది.. ఆ పాట ఎంత బలమైనదో.. ఆ పాటకు ఎంత ప్రాధాన్యత ఉందో.. అలాంటి 'ఏమి మిగిలినాదిరా' అనే పాట ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది..

**ముద్ర, శ్రీకాకుళం:**
సిపిఐ జాతీయ కార్యదర్శి కె .రామకృష్ణ ఒక పాట సోషల్ మీడియాలో విని, పాట రచయిత, సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు ఇంటికి వెళ్లి సత్కరించడం ఒక ఊహించని పరిణామం.' ఏమి మిగిలినాదిరా! అందాల మా అడవిలో! 'అనే పాట సోషల్ మీడియాలో, ఆదివాసి గ్రూపుల్లో బాగా వైరల్ అవుతోంది. దాదాపు మూడు లక్షల మంది వ్యూవర్స్ నమోదయ్యారు. ఎంతోమంది ప్రముఖులు ఈ పాటను చూసి ప్రశంసలు, ఆవేదనలు వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ కూడా, చూసి బాగా చలించిపోయారు. చూసిన రోజే, ఫోన్లో ధర్మారావుతో తన భావోద్వేగాన్ని పంచుకున్నారు. గురువారం శ్రీకాకుళంలో కోర్టు వాయిదాకు హాజరు కావడానికి వచ్చిన ఆయన, ధర్మారావు ఇంటికి వెళ్లి శాలువ కప్పి అభినందించడం విశేషం. ఊహించని ఈ పరిణామానికి ధర్మారావు కుటుంబ సభ్యులు ఆశ్చర్యపోయారు. ఆదివాసీల వేదనలను సొంతం చేసుకొని పాట రాశారని రామకృష్ణ అభినందించారు. తమ ఇంటికి వచ్చినందుకు ధర్మారావు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రామకృష్ణతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ వచ్చి, ధర్మారావును సత్కరించారు.

# ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్

**జూబ్లీహిల్స్‌లో నీరూస్ షోరూమ్ సీజ్**
**నాంపల్లి స్టేషన్ రోడ్డులో ఫర్నీచర్ షోరూంకు తాళం**

**ముద్ర, హైదరాబాద్:**
నగరంలోని వాణిజ్య సముదాయాల్లో హైడ్రా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 36లోని నీరూస్ షోరూంను గురువారం తనిఖీ చేయగా.., నిబంధనల ప్రకారం లేకపోవడంతో హైడ్రా కమిషనర్ సీరియస్‌గా పరిగణించారు. ఫైర్ ఎన్వోసీ లేకుండా షాపులను నిర్వహిస్తున్నట్టు నిర్ధారించుకున్నారు. ఫైర్ నిబంధనలను పాటించకపోవడమే కాకుండా.. ఫైర్ ఎక్స్టింగ్విషర్ (మంటలను ఆర్పేది) లు కూడా సరిగా లేకపోవడాన్ని



గమనించారు. నిబంధనలు పాటించకపోవడంతో హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు సీజ్ చేశారు.

**నాంపల్లిలోని ఫర్నీచర్ షోరూంకూ తాళం..**
నాంపల్లి స్టేషన్ రోడ్డులో గత శనివారం బచ్చాస్ ఫర్నీచర్ షోరూంలో అగ్ని ప్రమాదం సంభవించడం.. ఐదుగురు మృతి చెందిన ఘటన తర్వాత కూడా అదే రోడ్డులో ఉన్న దుకాణదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా పరిగణించారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులో రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నీచర్ దుకాణం ఉన్న భవనం 6 అంతస్తులుండగా.. సెల్లార్‌తో పాటు.. మొత్తం అన్ని అంతస్తుల్లో భారీగా ఫర్నీచర్ నిలువలుంచడం.. మెట్ల మార్గాన్ని కూడా మూసేసిన విధంగా స్టాక్ పెట్టడం పట్ల హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 6 అంతస్తులు తనిఖీ చేసి, నిబంధనలు ఎక్కడా కానరాకపోవడంతో సీజ్ చేయాలని ఆదేశించారు. ఈమేరకు హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్ విభాగంతో పాటు విద్యుత్ శాఖకు చెందిన అధికారులు చర్యలు తీసుకున్నారు. వెంటనే విద్యుత్ సరఫరా ఆపేశారు. ఆ భవనంలో వ్యాపార లావాదేవీలు జరగకుండా నిలిపేశారు.

**ఫిర్యాదు చేయండి..**
ఫైర్ నిబంధనలు లేవని గమనిస్తే.. హైడ్రా కంట్రోల్ రూమ్ 9000113667 నంబరుతో పాటు.. నేరుగా తన నంబరు 7207923085 కు సమాచారం ఇవ్వాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగర ప్రజలను కోరారు. వ్యాపార సముదాయాల వివరాలతో పాటు.. ఏ ప్రాంతంలో ఉన్నది స్పష్టంగా పేర్కొంటూ వాట్సాప్ ద్వారా, ఫొటోలు, వీడియోలు పంపాలని సూచించారు. (Commissioner-HYDRAA) పేరిట ఉన్న ఎక్స్(ట్విట్టర్)లోనూ ఫిర్యాదు చేయాలని హైడ్రా కమిషనర్ కోరారు.

# కేసీఆర్ పై రాజకీయ కక్ష

**ప్రజా వ్యతిరేకత నుంచి తప్పించుకునేందుకే నోటీసుల డ్రామా**
**మాజీ మంత్రి హరీశ్ రావు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మాజీ సీఎం కేసీఆర్ కు ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడం వెనక రేవంత్ సర్కార్ రాజకీయ కుట్ర దాగి ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. పరిపాలన చేతకాక ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అంటూ మండిపడ్డారు. కేసీఆర్‌కు నోటీసులు జారీపై గురువారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ జాతి పిత, కోట్లాది మంది ప్రజల ఆరాధ్యుడు కేసీఆర్ అన్నారు. రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలం పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహా నేత కేసీఆర్ పై బురద చల్లాలని ప్రయత్నించడం సూర్యునిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ చరిత్రను సృష్టిస్తే.. రేవంత్ రెడ్డి ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదు.. అహంకారం అంతకంటే కాదని అన్నారు. తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉందని, కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే బుద్ధి చెబుతారని హరీశ్ రావు చెప్పారు.

## రాజకీయ దురుద్దేశం లేదు

**సిట్ విచారణ పారదర్శకంగా జరుగుతోంది**
**కేసీఆర్‌కు నోటీసులు దర్యాప్తులో భాగమే**
**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా సిట్ అధికారులు మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం వెనక రాజకీయ దురుద్దేశం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పారదర్శకంగా సాగుతోందని పునరుద్ఘాటించారు. దర్యాప్తు ప్రక్రియలో భాగంగా అవసరమైతే ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్‌కు ఉందన్నారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యమ నాయకుడిగా మాజీ సీఎం కేసీఆర్ అంటే తమకు గౌరవం ఉందని చెప్పరు. అయితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన ట్యాపింగ్ ఉదంతంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందనేది నిగ్గు తేలాల్సి ఉందన్నారు. అధికారుల ప్రమేయం మాత్రమే కాకుండా అప్పటి సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ స్థాయి ఉల్లంఘనలు జరగవని ఆయన అభిప్రాయపడ్డారు. సిట్ దర్యాప్తు పూర్తి స్థాయిలో జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన చెప్పారు. ఇది కేవలం చట్టపరమైన ప్రక్రియ అని, బాధ్యులెవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని వెల్లడించారు. కాగా ఈ కేసులో సిట్ అధికారులు కీలక అధికారుల అరెస్టులు, వాంగ్మూలాలు సేకరించిన నేపథ్యంలో.. విచారణ వేగవంతమై తర్వాత ఎవరికి నోటీసులు అందబోతున్నాయనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది.



# బీజేపీ బీసీ వ్యతిరేకి

**2011లో కాంగ్రెస్ చేసిన తప్పే బీజేపీ చేస్తోంది**
**బీజేపీ కుట్రను బీఆర్ఎస్ ఖండించలేదు**
**జనగణనపై కేంద్రానికి నివేదిక ఇస్తాం**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
కేంద్రంలోని బీజేపీ సర్కార్ కులగణన విషయంలో దేశ ప్రజలను మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. దేశవ్యాప్తంగా త్వరలో నిర్వహించ తలపెట్టిన జరగబోయే జనగణన డాక్యుమెంట్‌లో.. గతంలో ఉన్న మాదిరిగానే ఎస్సీ, ఎస్టీ కేటగిరి పెట్టి ఓబీసీ, ఇతర కులాలను ఇతరులు అని పొందుపర్చారని విమర్శించారు. దీంతో కులం దాని కింద ఉండే ఉప కులాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఖాజా మెన్షన్ లో నిర్వహించిన కేంద్ర జనగణనలో కులగణన పై రౌండ్ టేబుల్ సమావేశంలో ముందుగా అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 2011లో రూ. 4500 కోట్లతో కాంగ్రెస్ జనగణనలో ఏ తప్పు చేసిందో బీజేపీ కూడా అదే చేస్తోందని ఆరోపించారు. ఇప్పుడు రూ. 11వేల కోట్లతో చేపట్టబోయే జనగణనలో బీసీలను మోసం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. భారతదేశంలో కుల వ్యవస్థ ఎంత కన్ఫ్యూజన్ గా ఉంటుందో మనందరికి తెలుసని చెప్పారు. ఓ కమ్యూనిటీ ఒక రాష్ట్రంలో ఒక కేటగిరిలో ఉంటే మరో రాష్ట్రంలో ఇంకో కేటగిరిలో ఉంటోందన్నారు. అలాంటిది 56 శాతం ఉన్న ఓబీసీ కమ్యూనిటీ విషయంలో ఎంత కన్ఫ్యూజన్ ఉంటుందో ఆలోచించాలని ప్రశ్నించారు. జనగణన చేసినప్పుడే ఏ వర్గం ఎంత ఉంది? వారికి బడ్జెట్, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయన్నది తెలుస్తుందన్నారు. కులగణనకు కేంద్రం ముందుకు రావటంతో సంతోషించామన్న ఆమె.. ఎప్పుడైతే డాక్యుమెంట్ విడుదల చేశారో అప్పుడే కేంద్రం బుద్ధి బయట పడిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అగ్రవర్ణాల్లోని పేదలకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని చెప్పారు. వీళ్లు ఏ కేటగిరిలోకి వస్తారో అనేది ఈ కులం అనే కాలమ్ తో క్లారిటీ రాదన్నారు. బీజేపీ తెచ్చిన సెన్సస్ డాక్యుమెంట్ చాలా గందరగోళంగా ఉందనీ ఇదంతో ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని చెప్పారు. తెలంగాణలోనూ చర్చ జరిగి మన రాష్ట్ర అభిప్రాయాలను కేంద్రానికి ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో ఉన్న కులాలు వాటి కింద ఉన్న ఉపకులాల డేటాను తెలంగాణ జాగృతి తరఫున సేకరించి కేంద్రానికి పంపుతామని కవిత వెల్లడించారు. ఇందుకు అందరి మద్దతు కావాలని కోరారు. నిజానికి ఈ పని రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేయాలి కానీ అలా చేయడం లేదన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల పాత్ర చాలా కీలకంగా ఉంటుందని కానీ సెన్సస్ డాక్యుమెంట్ మీద బీఆర్ఎస్, కాంగ్రెస్, ఏమీ మాట్లాడటం లేదన్నారు. ఈ పార్టీలన్నీ ఈ విషయంలో తమ వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## స్పీకర్ నుంచి పిలుపు రాలేదు

**బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేయలేదు**
**పార్టీ ఫిరాయింపు నోటీసులపై నా న్యాయవాది స్పీకర్ కు లేఖ**
**ఉప ఎన్నిక వచ్చినా భయపడను**
**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం**



**ముద్ర, హైదరాబాద్:**
పార్టీ ఫిరాయింపు కేసు వ్యవహారంలో విచారణకు రావాలని అసెంబ్లీ స్పీకర్ నుంచి తనను ఎలాంటి ఆదేశాలు రాలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. విచారణ నిమిత్తం తనను వ్యక్తిగతంగా హాజరుకావాలని స్పీకర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు. ప్రస్తుతానికి తన లీగల్ టీమ్ ఈ వ్యవహారాన్ని చూసుకుందని వెల్లడించారు. గురువారం ఖైరతాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్పీకర్ కార్యాలయం నుంచి అందిన నోటీసులకు సంబంధించి తన తరపు న్యాయవాది ఇప్పటికే స్పందించారని తెలిపారు. స్పీకర్‌కు వివరణ ఇస్తూ లేఖ రాశారని చెప్పారు. అయితే ఆ లేఖలో ఏయే అంశాలను పొందుపరిచారనే విషయంపై తనకు పూర్తి అవగాహన లేదన్నారు. తమ తరపున వివరణ పంపినప్పటికీ, స్పీకర్ కార్యాలయం నుంచి ఇప్పటి వరకు తమకు ఎలాంటి జవాబు రాలేదని తెలిపారు. విచారణ ప్రక్రియకు సంబంధించి తాము పంపిన వివరణపై స్పీకర్ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని దానం వివరణ ఇచ్చారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేయలేదని చెప్పారు. ఒకవేళ చేసినా వారి యాక్షన్‌కు తన రియాక్షన్ ఉంటుందని వ్యాఖ్యానించారు. తాను ఎన్నికలకు భయపడే వ్యక్తి కాదన్న దానం.. ఉప ఎన్నికలొచ్చినా గెలిచి తీరుతానన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ బరిలో స్పీకర్ తనయ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఎట్టకేలకు వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తనయ అనన్య రాజకీయ ఆరంగేట్రం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ ఎన్నికల్లో తొలిసారి బరిలోకి దిగిన అనన్య, కాంగ్రెస్ చైర్ పర్సన్ అభ్యర్థిగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. చైర్పర్సన్ పీఠాన్ని కైవసం చేసుకునే లక్ష్యంతో పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. అనన్య కు మద్దతుగా మున్సిపాలిటీ పరిధిలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతా ఏకమయ్యారు. ఆమె గెలుపే లక్ష్యంగా సర్వశక్తులు వినియోగించేందుకు నాయకులు బాధ్యతను భుజాన వేసుకున్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు నుంచి, మధు కాలనీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున అనన్య నామినేషన్ దాఖలు చేశారు. సీనియర్ నాయకులతో కూడిన 20 మంది సభ్యుల కోర్ కమిటీతో పాటు సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్‌కు దీటుగా పోటీ ఇస్తూ, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం పావులు కదుపుతోంది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శుక్రవారం 30.01.2026



మీ ముద్ర వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## టీ20 వరల్డ్ కప్ ముందు
# భారత్ మేలుకోవాల్సిందే?

టీ20 వరల్డ్ కప్ సమరానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో క్రికెట్ ప్రపంచంలో సందడి మొదలైంది. టైటిల్ ఫేవరెట్ గా బరిలోకి దిగుతున్న భారత జట్టుకు, న్యూజిలాండ్‌తో జరుగుతు న్న ప్రస్తుత టీ20 సిరీస్ ఒక అద్భుతమైన ప్రాక్టీస్ వేదికగా నిలిచింది. అయితే వరు సగా మూడు విజయాలతో జోరు మీదున్న భారత్‌కు నాలుగో టీ20లో కివీస్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ ఫలితం మాత్రమే కాదు.. మెగా టోర్నీ ముందు భారత జట్టుకు ఒక గట్టి హెచ్చరిక!

**వైజాగ్‌లో విలవిల.. నిర్లక్ష్యానికి భారీ మూల్యం!**

విశాఖపట్నం వేదికగా జరిగిన నాలుగో టీ 20లో భారత్ అన్ని విభాగాల్లోనూ విఫలమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజి లాండ్ జట్టు భారత బౌలర్లను ఉతికేస్తూ నిర్ణీత ఓవర్లలో 215 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫ్లాట్ పిచ్‌పై కివీస్ బ్యా టర్లు పరుగుల వరద పారించారు.

లక్ష్య ఛేదనలో భారత్ కనీస పోరాట పటిమ చూపలేకపోయింది. టాపార్డర్ విఫలమవ్వడంతో నిర్ణీత ఓవర్లలో 165 పరుగులకే పరిమితమై, 40 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. ఈ మ్యాచ్‌లో భారత్ ప్రదర్శించిన 'కాన్ఫిడెన్స్' కాస్తా 'ఓవర్ కా న్ఫిడెన్స్'గా మారిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

**దూబే మెరుపులు.. మిగతా వారు నిలకడలేమి!**

ఈ ఓటమిలోనూ భారత అభిమానులను అ లరించింది ఒక్క శివం దూబే మాత్రమే. సిక్సర్ల కింగ్‌గా పేరు తెచ్చుకున్న దూబే కే వలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది భారత క్రికెట్ చరిత్రలో మూడవ వేగవంతమైన అర్ధశతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. కానీ అతడికి మరో ఎండ్ నుం చి మద్దతు కరువవ్వడంతో భారత్ గమ్యా న్ని చేరుకోలేకపోయింది.

**సూపర్‌స్టార్ల ఫామ్.. ఆందోళనలో అభిమానులు!**

టీ20 ఫార్మాట్‌లో భారత్ ఎప్పుడూ తన స్టార్ పవర్‌పైనే ఆధారపడుతుంది. అయితే ప్రస్తుతం సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో జట్టు బాధ్యతను మోయాల్సిన ఇద్దరు కీలక ఆటగాళ్ల ప్రదర్శన మేనేజ్‌మెంట్‌కు నిద్ర లేకుండా చేస్తోంది.

డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బుమ్రా, నాలుగో టీ20 లో తన మార్క్ చూపలేకపోయాడు. చివరి ఓవర్‌లో దాదాపు 20 పరుగులు సమర్పించుకోవడం బుమ్రా స్థాయికి తగని ప్రదర్శ న. వరల్డ్ కప్‌లో బుమ్రా యార్కర్లు మిస్ అయితే భారత్ భారీ మూల్యం చెల్లించా ల్సి ఉంటుంది.

ఫినిషర్‌గా, ఆల్‌రౌండర్‌గా జట్టుకు వెన్నెముక వంటి హార్దిక్, తన స్థిరత్వాన్ని కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఒక మ్యాచ్‌లో అద్భు తంగా ఆడుతున్నా, కీలకమైన సమయా ల్లో వికెట్ పారేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ కప్‌లో జట్టు సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే హార్దిక్ బాధ్యతాయుతమైన ఆట తీరు అవసరం.

**పాఠాలు నేర్చుకుంటారా?**

వరల్డ్ కప్ వంటి పెద్ద టోర్నీల్లో చిన్న పొరపాట్లకు కూడా తావుండదు. వైజాగ్‌లో ఎదు రైన ఈ పరాజయం భారత్‌కు ఒక రకంగా మేలు చేసేదే. లోపాలను సరిదిద్దుకోవడానికి.. వ్యూహాలను పదును పెట్టుకోవడానికి ఇది సరైన సమయం. మరి ఈ 'వేక్-అప్ కాల్'ను అందుకుని టీమ్ ఇండియా విజేతగా నిలుస్తుందో లేదో చూడాలి!

- నరేష్, ముద్ర



# నీలగిరి తార్

భారతదేశ జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలిచే అరుదైన అడవి జంతువుల్లో నీలగిరి తార్ ఒకటి. దక్షిణ భారతదేశంలోని పశ్చిమ కనుమల పర్వత శ్రేణుల్లో మాత్రమే కనిపించే ఈ జం తువు, ప్రత్యేక లక్షణాలు.. అరుదైన నివాస ప్రాంతాల వల్ల విశేష ప్రాధాన్యం పొందింది.

నీలగిరి తార్ అనేది ఒక అరుదైన అడవి మేక జాతి. ఇది ప్రధానంగా తమిళనాడు మరియు కేరళ రాష్ట్రాల్లోని ఎత్తైన పర్వత ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తుంది. ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో ఇది సహజంగా ఉండదు.

### ముఖ్య లక్షణాలు

దృఢమైన శరీరం, వెనక్కి వంగిన చిన్న కొమ్ములు వీటి ప్రత్యేకత. మగ తార్‌ల వీపుపై కనిపించే వెండి రంగు మచ్చను "సాడిల్" అని పిలుస్తారు. నిటారుగా ఉన్న కొండలు, రాతి శిఖరాలను అద్భుతంగా ఎక్కగల సామర్థ్యం వీటికి ఉంటుంది. అందుకే వీటిని "పర్వత గజగామి" అని కూడా అంటారు. సముద్ర మట్టానికి సుమారు 1200 నుండి 2600 మీటర్ల ఎత్తులో ఉన్న గడ్డి భూములు, పర్వత మైదానాలు నివాస ప్రదేశాలు.

ప్రస్తుతం నీలగిరి తార్ అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉంది.అక్రమ వేట, అడవుల నాశనం, వాతావరణ మార్పులు ప్రధాన కారణాలు.సంరక్షణ చర్యల వల్ల కేరళలోని ఎర్నాకులం నేషనల్ పార్క్ , తమిళనాడులోని అన్నామలై టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో వీటి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నీలగిరి తార్ తమిళనాడు రాష్ట్ర అధికారిక జంతువుగా గుర్తింపు పొందింది. ఇది రాష్ట్ర జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

ప్రకృతి ప్రసాదించిన అరుదైన జీవ సంపదలో నీలగిరి తార్ ఒక అపూర్వమైన జాతి. వీటి సంరక్షణకు ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజలు కూడా అవగాహన పెంచుకొని సహకరించడం అవసరం. అప్పుడు మాత్రమే ఈ పర్వత గజగామి భవిష్యత్ తరాలకు సజీవ వారసత్వంగా నిలుస్తుంది.



# బొగ్గు బ్లాక్ టెండర్ల మాయా మర్మం



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646.. (ఏఐటీయూసీ రాష్ట్ర సీనియర్ నాయకులు)

ఒడిస్సాలోని నైని బొగ్గు బ్లాక్ ను కేంద్రప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించినప్పటికీ సింగరేణి సంస్థ స్వతహాగా నిర్వహించలేని పరిస్థితిఉంది. సింగరేణికి 816 కిలో మీటర్లకు పైగా దూరంలో ఉంటుంది. అక్కడ తీసిన బొగ్గును ఇక్కడి థర్మల్ పవర్ స్టేషన్‌కు ఉపయోగించాలన్న ట్రాన్స్ పోర్టు ఖర్చు తడిసి మోపడుతుంది. బొగ్గు రవాణాకు రైల్ మార్గం కూడా లేదు. సింగరేణి సంస్థకు కేటాయించినప్పటికీ వారు తిరిగి ప్రైవేట్ సంస్థకు అప్పజెప్పల్సిందే. సింగరేణి కంపెనీ డబ్బులతో భూగర్భ పరిశోధన చేసి బొగ్గు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న మణుగూరు పీకే ఓసిపి, తాడిచర్ల బ్లాక్ -2, పెనుగడప, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాక్ లను టెండర్/ బిడ్డింగ్ ప్రక్రియ లేకుండా కేటాయించాలని చాలా కాలం నుండి సింగరేణి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం గుడా కోరుతుంది. అయినా కేంద్రం పెడచేయిపెట్టుతు ప్రైవేట్ కాంట్రాక్టర్స్ కు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుంది. టెండర్ ప్రక్రియలో సింగరేణి పాలుగోనాలని ప్రభుత్వం నిర్ణయించింది.



### నైని బొగ్గు బ్లాక్ టెండర్స్ పై రగడ!

సింగరేణి సంస్థ నైని బొగ్గు బ్లాక్ టెండర్స్ ప్రక్రియను చేపట్టి జనవరి 22 -29 తేదీలలో టెండర్స్ ను ఆహ్వానించింది.అదే రోజు అవినీతి జరిగిందని ప్రతిపక్ష మీడియా వర్గాలలో చర్చనీయాంశంగా తెరమీదకి వచ్చింది. దీనిపై గత వారం రోజులుగా తెలంగాణ రాష్ట్ర అధికార పార్టీపైన ప్రధాన పక్ష బిఆరెస్, బిజెపిలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ నైని బొగ్గు బ్లాక్ టెండర్ చీకటి కోణాలపై విచారణకు డిమాండ్ చేసింది. రేవంత్ రెడ్డి అనుయాయుల కోసం సైట్ విజిట్ సర్టిఫికెట్ తీసుకొచ్చారని కెటిఆర్ ఆరోపణలు చేస్తు రాష్ట్ర గవర్నర్ కు విచారణ జరిపించాలని ఫిర్యాదు చేసింది.అయితే సర్టిఫికెట్ నిబంధన కొత్తదేమి కాదని గతంలో ఉన్న పద్ధతినే అవలంబిస్తున్నామని, టెండర్లు వేయడానికి 22 - 29 తేదీల మధ్య గడువు ప్రకటించినట్లు చెప్పారు. టెండర్లు దాఖలే 22వ తేదీ నుండి శుక్రవారం నుండి మొదలవుతుంటే అప్పుడే సంస్థలు దాఖలు చేసిన టెండర్లను రద్దు చేసిందన్న ఆరోపణల్లో పసలేదని అధికారులు అంటున్నారు. టెండర్లు వేయక ముందే నైని బొగ్గు బ్లాక్ టెండర్లలో జరిగిన అవకతవకలపై కేంద్ర బొగ్గు గనులు మరియు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి కూడా స్పందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తే ఒడిస్సా లోని నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ పై సిబిఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) విచారణకు ఆదేశిస్తామని ప్రకటించారు. నైని బొగ్గు బ్లాక్ టెండర్లలో అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణల దృష్ట్యా సింగరేణి యజమాన్యం కాంట్రాక్టు టెండర్ను రద్దు చేసింది. భారత ప్రభుత్వం బొగ్గు గల మంత్రిత్వ శాఖనేమో ఫైల్ నెంబర్ సిఎ-28/1/2026 ఆదేశాలతో దిసభ్య కమిటీతో విచారణ జరిపి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరింది.

ఆంధ్ర జ్యోతి పత్రిక అయితే కొత్త పలుకు శీర్షిక పేర రాధాకృష్ణ రాసిన " బొగ్గు కోసం నీచ కథనం" అంటూ పెద్ద కథనాన్ని ప్రచురించింది. అందులో కేంద్ర ప్రభుత్వం ఒడిస్సా రాష్ట్రం లోని నైని బొగ్గు బ్లాక్ ను సింగరేణి కంపెనీకి కేటాయించింది. ఆ సమయములో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ఆదానీ ని ముందుకు పెట్టి ప్రతిమా శ్రీనివాస్ కు చెందిన కంపెనీకి బొగ్గు తవ్వకాల కాంట్రాక్టు పలనుఅప్పజెప్పాలని ప్రయత్నించింది. అప్పుడు ఎంపీగా ఉన్న కోమటి రెడ్డి వెంకటరెడ్డి తన తమ్ముడికి చెందిన 'సుశీ హైటెక్ కంపెనీ'కి బొగ్గు తవ్వకాల కాంట్రాక్టు టెండర్లలో అవకాశం ఇవ్వలేదని లేఖలు రాశాడు. దానితో టెండర్ ఖరారు చేయలేని పరిస్థితి వచ్చింది. ఇంతలోనే 2023 డిసెంబర్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మరల నైనీ బొగ్గు బ్లాక్ తవ్వకాల పనులు మొదలైనవి. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టు విక్రమార్క బొగ్గు బ్లాక్ ను సందర్శించి ఒడిస్సా ప్రభుత్వంతో మాట్లాడి మార్గం సుగమం చేశాడు.2025 ఏప్రిల్ 16న తన క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ ప్రారంభం చేశాడు.

### రాష్ట్ర మంత్రుల్లో విభజనరేఖ:

గత 15 రోజులుగా నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల కాంట్రాక్టు పనుల కేటాయింపుల్లో రాష్ట్ర మంత్రులు విభజన రేఖ ఏర్పడింది. టెండర్ల పనుల కేటాయింపు ప్రక్రియను తప్పు పట్టిన మంత్రిపై అపవాద అనైతికత కథనాన్ని ఎన్టీవీ ఛానల్ ప్రసారం చేసింది. దానికి పోటీగా ఆంధ్రజ్యోతి 'బొగ్గు కోసం నీచ కథనం'ను ప్రచురించింది. మీడియా రెండు శిబిరాలుగా చర్చోప చర్చలు చేస్తున్నది. ఇక ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి "రెండు ఆంబోతులు కొట్లాడి లేగ కాళ్లు విరుగు కొట్టిన చందంగా" మీడియా రాష్ట్ర మంత్రుల పైన కథనాలను రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కథనాలను ముఖ్యమంత్రిగా ఖండించడమో లేదా విచారణకు ఆదేశించడమో చేయాలి. కానీ మీడియాను ఆంబోతులుగా, మంత్రులను లేగ దూడలుగా ఉపమానం చేయడానికి ప్రజలు నవ్వుకుంటున్నారు. మంత్రులపైన/ ప్రభుత్వం పైన వార్తా కథనాలను ప్రసారం చేసే ముందు వాటిపై వివరణలు తీసుకోవాలని కోరినారు.

### వివాదాస్పదంగా సైట్ విజిట్ సర్టిఫికెట్

టెండర్ల విషయంలో సైట్ విజిట్ సర్టిఫికేట్ పెద్ద వివాదంగా మారింది. ఈ వివాదం పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుపడుతుండగా, కాంగ్రెస్ అధికార ప్రతినిధులు బిఆర్ఎస్ నేతలపై ఎదురుగా దాడులు చేస్తున్నారు. తన బావమరిదికి నైనీ కోల్ మైన్ తవ్వకాల కాంట్రాక్టు ఇచ్చుకోవటానికి రేవంత్ సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన తెచ్చారని కేటీఆర్ అండ్ కో పదేపదే ఆరోపణ చేస్తున్నారు. కానీ వాస్తవంగా ఈ ఆరోపణలు నిజం లేదు. సైట్ విజిట్ సర్టిఫికేషన్ నిబంధన 2018 నుండి సింగరేణిలో అమలులో ఉందని, అప్పట్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారములోఉంది. గతంలో ఉన్న నిబంధనలనే కొనసాగిస్తు న్నామని కొత్తగా ఏమి చేర్చలేదని సింగరేణియాజమాన్యం ప్రకటించింది.

### నైనీ బ్లాక్ నేపథ్యం

భారత ప్రభుత్వం నవరత్న కంపెనీ కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్)కు అనుబంధ సంస్థ అయినా" సెంట్రల్ మెయిన్ ప్లానింగ్ డిజైన్ ఇన్స్టిట్యూట్ లిమిటెడ్"(సిఎంపిడిఐఎల్) నైనిని జియాలోజికల్ సర్వే చేసింది. ఇది ఒడిస్సా రాష్ట్రంలోని అంగుల్ జిల్లా, చెండిపద రెవెన్యూ శివారు. ఉపరితల వైశాల్యం762.41 హెక్టార్లో,455.18 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లుగా తెలిపింది. గనుల నిల్వలను 378.64 మిలియన్ టన్నులుగా, సంగ్రహించదగిన నిల్వలు 340.78 మిలియన్ టన్నులుగా పేర్కొంది. క్వారీ లోతు 550 మీటర్లు, హార్డ్ ఓట్ 870.67 మిలియన్ క్యూబిక్ మీటర్స్ గా, మొత్తం ఓబీ (మట్టి తొలగింపు) 878.28 మిలియన్ క్యూబిక్ మీటర్స్ గా, సగటు స్ట్రిప్పింగ్ నిష్పత్తి 2.58 క్యూబిక్ టన్నులుగా, బొగ్గు సగటు గ్రేడ్ జి -10, కిలో బొగ్గు 4.300 కేలరీల స్థూల కిలో రిఫిక్ విలువ (జీసీవి ) ఉంటుందని జీవిత కాలం 36 సంవత్సరాలుగా, 6 గ్రామాల పునరావాసం కోసం రూ. 115 కోట్లు, ప్రాజెక్టు ఖర్చురూ. 478.85 కోట్లు, భూమి అవసరం 912.799 హెక్టార్లు, అందులో అటవీభూమి783.275 హెక్టార్లు, అటవేతర భూమి 129.524 హెక్టార్లుగా నివేదించింది.

నైనీ బొగ్గు బ్లాక్ ను కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ 2017 ఆగస్టు 13న సింగరేణి కంపెనీకి పునః కేటాయించింది. మైన్ డెవలపర్ కం ఆపరేటర్(ఎం డి ఓ) ప్రతిపాదికన సింగరేణి తీసుకుంది. మంచిర్యాల జిల్లా జైపూర్ దగ్గర "2x6=1200 మెగావాట్లు" సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్( ఎస్టీ పిపి) మరియు కొత్తగా నిర్మించబోయే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్ర బొగ్గు సరఫరా గురించి కేటాయించారు. ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2016 ఆగస్టు 7న ఎన్ టి పి పి ని దేశానికి అంకితం. వాస్తవంగా నైనీ బొగ్గు బ్లాక్ బొగ్గును రవాణా చేసుకుని ఎన్ టివిపికి వాడుకోవడం లాభదాయం కాదు. ఎందుకంటే నైనీ బొగ్గు బ్లాక్ బొగ్గును రోడ్డు మార్గం ద్వారా రవాణా చేసుకోవడానికి 816 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రైల్వే వ్యాగన్ల ద్వారా రవాణా చేసుకోవడానికి 'జరపాడా రైల్వే సైడింగ్ ప్రణాళికతో 60 కిలోమీటర్ల రైల్వే మార్గం నిర్మించుకోవాలి. ఇది తక్షణమే జరిగే పని కాదు. నైని బొగ్గు బ్లాక్ లో నిజానికి 2021 -22 లోనే బొగ్గు ఉత్పత్తి కావలసి ఉన్నప్పటికీ ఇప్పటికీ నాలుగు సంవత్సరాలు ఆలస్యం అయిందని 'నీతి అయోగ్' పేర్కొంది.

సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు 10 కిలో మీటర్ల నుండి 60 కిలోమీటర్ల పరిధిలో రోజుకు దాదాపు లక్ష యాభై వేల టన్నుల బొగ్గు ఉత్పత్తిని తీసే బొగ్గు గనులు ఉన్నవి. తలాపునే 15 కిలోమీటర్ల దూరంలో ఇందారం, శ్రీరాంపూర్, రామకృష్ణ పూర్ ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నవి. అయినప్పటికీ 816 కిలోమీటర్ల దూరంలో ఉన్న నైనీ బొగ్గు బ్లాక్ నుండి బొగ్గు రవాణా చేసుకోవడంలో మర్మమేమిటో ప్రజలకు అంతు పట్టడం లేదు.

### తెలంగాణలోని ఓసి బ్లాకులను సింగరేణికి కేటాయించాలి!

తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి కంపెనీ డబ్బులతో భూగర్భ పరిశోధన చేసి బొగ్గు ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న మణుగూరు పీకే ఓసిపి, తాడిచెర్ల బ్లాక్ -2, పెనుగడప, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు బ్లాక్ లను టెండర్/ బిడ్డింగ్ ప్రక్రియలు లేకుండా "ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్" ప్రభుత్వ సంస్థకు కేటాయింపు చేసి సింగరేణి అభివృద్ధికి తోడ్పాలని కోరుతున్నారు.

### సింగరేణిలో టెండర్లలో బిఆర్ఎస్ వారిదేహవా!

సింగరేణి సంస్థ గతంలో నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. ఆ నాలుగు టెండర్లను దక్కించుకున్నది టిఆర్ఎస్ సంబంధిత కాంట్రాక్టు సంస్థలేనని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు తెలిపారు.

1. వికేఓసి-1, కొత్తగూడెం కాంట్రాక్ట్ ను సోదా కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి దీప్తి రెడ్డి దక్కించుకున్నారు. దీప్తి రెడ్డి బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కూతురు. ఇదే కంపెనీకి ఈ గని పక్కనే ఉన్న వీకేఓసి-2 ప్రాజెక్టును 2023, నవంబర్ లో 10 శాతం అధిక రేటుతో కేటాయించినట్లు తెలిపారు.
2. మందమర్రిలోని కళ్యాణఖని ఓపెన్ కాస్టు ప్రాజెక్టు కోసం 12 సంస్థలు పాల్గొన్నాయి. అందరికీ సంస్థ సైట్ విజిట్ సర్టిఫికేట్ జారీ చేసింది. కాంట్రాక్టు పొందిన సంస్థ ఎక్స్ ప్రేస్ వే ఆర్వి ఎస్ఆర్ జేవీ సంస్థ. దీనికి ఎండిలు దీక్షిత్ రావు, ప్రతిమా శ్రీనివాసరావు, బిఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ రావు మేనల్లుడు.
3. ఆర్జిఓసి -11 టెండర్ల కోసం 6 సంస్థలు పాల్గొన్నాయి. సైట్ విజిట్ సర్టిఫికేట్ అందిన తర్వాత కాంట్రాక్టు పొందిన సంస్థ సి5 ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్. దీనిలో నిశాంత్ రావు, మదన్ రావు డైరెక్టర్లు. నిశాంత్ రావు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రావు కొడుకు. సుధాకర్ రావు కెసిఆర్, హరీష్ రావు ఇద్దరితోనూ దగ్గర బంధుత్వం ఉన్నది.
4. ఎస్ ఆర్ పి ఓ సి 11 ప్రాజెక్టు. దీని కాంట్రాక్ట్ కోసం 12 మంది టెండర్లు దాఖలు చేస్తే హర్ష కన్స్ ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ టెండర్లు దక్కించుకుంది. ఇదే సంస్థ బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక సాగునీటి ప్రాజెక్టులను చేసింది. ఈ కంపెనీకి బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ శాఖలో చక్రం తిప్పిన ఈఎన్సి మురళీధర్ రావు తో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిని బట్టి దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉన్నది.

# జీర్ణించుకోలేకపోతున్న ట్రంప్!

18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భారత్-ఈయూ(యురోపియన్ యూనియన్) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక చొరవతో పూర్తి చేశారు. ఇది పూర్తిగా ఇటి ఇండియాకు, అటు యూఈకు గేమ్ ఛేంజర్ డీల్ అని ఇరు పక్షాలు భావిస్తున్నా. ఈ అగ్రిమెంట్‌తో భారత్‌లో చాలా వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా టారిఫ్‌ల తర్వాత భారత్‌లో చాలా రంగాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తాజా డీల్‌లో తయారీ రంగం, ఫార్మా, వజ్రాల పరిశ్రమలు పుంజుకునే అవకాశ ఉంది. చాలా మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశిస్తున్నారు. అయితే ఈ డీల్‌ను అగ్రరాజ్యం అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నాడు. అమెరికాతో వాణిజ్యం ఒప్పందంపై తరచూ కొర్రీలు పెడుతూ భారత్ నష్టపోయాలే అగ్రిమెంట్ చేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతో మోదీ ప్రత్యామ్నాయ ఒప్పందాలపై దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతోపాటు పలు దేశాలతో ఇప్పటికే వాణిజ్య ఒప్పందం చేశారు. తాజాగా ఈయూతో డీల్ కుదిరింది.

**అమెరికా నిరాశకు కారణాలు..**

అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ భారత్-ఐరోపా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖండించారు. ఈ డీల్ తమను గాయపరిచిందని, ఈయూ యుద్ధ సమయంలో వాణిజ్య ప్రయోజనాలకు మొగ్గు చూపిందని మండిపడ్డారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'యూరోపియన్లు నిరాశ పరిచారు' అంటూ స్పష్టం చేశారు.

**ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో ఆరోపణలు**

ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతున్నప్పటికీ ఈయూ భారత్‌తో డీల్ కుదుర్చుకోవడం తప్పని బెసెంట్ పేర్కొన్నారు. గతేడాది అమెరికా-భారత దిగుమతులపై సుంకాలు విధించినప్పుడు ఈయూ మద్దతు ఇవ్వకపోవడాన్ని విమర్శించారు. సొంత ట్రేడ్ లాభాల కోసమే వారు మౌనంగా ఉన్నారని ఆరోపించారు.

**ఈయూ దేశాలకు రష్యా చమురు**

రష్యా చమురు భారత్‌కు వెళ్లి, శుద్ధి చేయబడి ఈయూ దేశాలకు ఎగుమతి అవుతోందని బెసెంట్ ఆరోపించారు. ఇది రష్యా యుద్ధానికి పరోక్షంగా ఆర్థిక సహాయంగా మారిందని వాదించారు. ఈ డీల్ గతంలోనూ అమెరికా నుంచి ఇలాంటి విమర్శలే ఎదుర్కొంది.

**మేడారం జాతర విశేషాలు**

తల్లీకూతుళ్ల పోరాటం: అన్యాయానికి, అరాచకానికి వ్యతిరేకంగా కాకతీయ రాజులతో పోరాడి వీరమరణం పొందిన సమ్మక్క-సారలమ్మల జ్ఞాపకార్థం ఈ జాతర నిర్వహిస్తారు.

### మియాపూర్ డివిజన్‌లో రూ.4.72కోట్ల

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



**మియాపూర్:**
మియాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మక్తా మహబూబ్‌పేట్ గ్రామంలోని పెద్ద కుడి చెరువు రిటైనింగ్ వాల్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. మొత్తం రూ. 4 కోట్ల 72 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆదిత్య నగర్, అరబిందో కాలనీ, ఎఫ్‌సీఐ వీడియో కాలనీ, కృషి నగర్, ఎంఏ నగర్, ప్రశాంత్ నగర్, నాగార్జున ఎనక్లేవ్, శ్రీసాయి నగర్, మక్తా మహబూబ్‌పేట్ తదితర కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమని తెలిపారు. ఈ పనులతో కాలనీవాసులకు ఉపశమనం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన ప్రయాణానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

**మంజూరైన పనులు..**
మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీ (లక్కీ రెస్టారెంట్ బ్యాక్ సైడ్)లో రూ.30 లక్షలు, అరబిందో కాలనీ మెయిన్ రోడ్డులో రూ.41 లక్షలు, ఎఫ్‌సీఐ వీడియో కాలనీలో రూ.36 లక్షలు, కృషి నగర్ కాలనీలో రూ.27లక్షలు, ఎంఏ నగర్ కాలనీలో రూ.96.50 లక్షలు, ప్రశాంత్ నగర్ కాలనీలో రూ.54 లక్షలు, నాగార్జున ఎనక్లేవ్ కాలనీలో రూ.40లక్షలు, శ్రీ సాయి నగర్ కాలనీలో రూ.48.50లక్షల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. అలాగే మక్తా మహబూబ్‌పేట్ గ్రామంలోని పెద్ద కుడి చెరువుకు రూ.కోటి 92 లక్షల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు, అదే గ్రామంలో రూ.13.50 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు అధికారులు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఆరు మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూములు**

**24 గంటలపాటు ఫిర్యాదుల స్వీకరణ**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**
ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ కంట్రోల్ రూములు 24 గంటలపాటు పని చేస్తాయన్నారు. అందిన ఫిర్యాదులను రికార్డు చేసి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికలు–2026కు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే, జిల్లా ప్రజలు క్రింది టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.



**కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు**

**ఆమనగల్ : 9032305567**
**చేవెళ్ల : 9493321468**
**ఇబ్రహీంపట్నం : 9032123653**
**మొయినాబాద్ : 7661097839**
**షాద్‌నగర్ : 9182403236**
**శంకర్‌పల్లి : 7386755646**

### వనపర్తి మున్సిపాలిటీకి

# బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా

**29 వార్డులకు అభ్యర్థుల ఖరారు..**
**నాలుగు వార్డులు పెండింగ్**

**వనపర్తి, ముద్ర:**
వనపర్తి మున్సిపాలిటీలోని మొత్తం 33 వార్డులకుగాను 29 వార్డుల బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని నిరంజన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ఈ జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3, 10, 11, 20 వార్డుల్లో ఆశావాహుల మధ్య పోటీ అధికంగా ఉండటంతో ఆ నాలుగు వార్డులను పెండింగ్‌లో ఉంచామని తెలిపారు. మిగతా 29 వార్డులకు సంబంధించి పార్టీ అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని వారు పిలుపునిచ్చారు.

**మున్సిపాలిటీ బిఆర్ఎస్ అభ్యర్థుల జాబితా..**
వనపర్తి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో 1వ వార్డుకు కాగితాల శారద, 2వ వార్డుకు ఉందే కోటి శివకుమార్, 3వ వార్డును పెండింగ్‌గా ఉంచగా, 4వ వార్డుకు సిరిగిరి మన్యం, 5వ వార్డుకు ప్రేమ్ కుమార్, 6వ వార్డుకు పాత్లావత్ కవితా నాయక్, 7వ వార్డుకు సింగన మౌని పద్మ, 8వ వార్డుకు వార్తవ్యత్ విజయ, 9వ వార్డుకు బ్యాదరి అనితను ప్రకటించారు. 10వ, 11వ వార్డులను పెండింగ్‌గా ఉంచగా, 12వ వార్డుకు కుమ్మరి యాదమ్మ, 13వ వార్డుకు పోతులపల్లి రాజు, 14వ వార్డుకు కాసోజు పవిత్ర, 15వ వార్డుకు బండారు సుజాత, 16వ వార్డుకు అయేషా సిద్ధిఖ్యా, 17వ వార్డుకు అబ్దుల్ అహ్మద్, 18వ వార్డుకు మదన్ (సీపీఎం), 19వ వార్డుకు సుగురు మురళి, 20వ వార్డును పెండింగ్‌గా ఉంచారు. 21వ వార్డుకు పుట్ట ఆంజనేయులు (సీపీఎం), 22వ వార్డుకు ఏర్వ అరుణ, 23వ వార్డుకు



పలుసా శ్రీకర్ గౌడ్, 24వ వార్డుకు ఏర్పుల అరుణ, 25వ వార్డుకు సాతర్ల రామకృష్ణ, 26వ వార్డుకు సూగురు శ్రీనివాసులు, 27వ వార్డుకు ఆవుల శ్రీలత, 28వ వార్డుకు మారుపాకుల విజయలక్ష్మి, 29వ వార్డుకు పోలీస్ భారతి, 30వ వార్డుకు వాకిటి శ్రీధర్, 31వ వార్డుకు షేక్ జహంగీర్, 32వ వార్డుకు పెండెం భాగ్యరేఖ, 33వ వార్డుకు ఉంగ్లం అలేఖ్య అభ్యర్థులుగా ఉన్నారని తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడి

**ముద్ర, వికారాబాద్:**
జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంతట్టి గ్రామంలో ఇసుక అక్రమ రవాణాపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం అందడంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణాకు పాల్పడిన నలుగురు డ్రైవర్లతోపాటు ట్రాక్టర్ల యజమానులపై కూడా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఇసుక తరలించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా**



**ముద్ర, వికారాబాద్:**
జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలంతా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడం చట్టవిరుద్ధమని ఎస్పీ హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం, పంపిణీకి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాల వినియోగం నిషేధమని తెలిపారు. రూ.50 వేలకు మించిన నగదు తరలింపునకు తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపాలని, సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## నామినేషన్లతో వేడెక్కిన వాతావరణం

**నేడు బి-ఫారంతో భారీగా దాఖలు చేసే ఛాన్స్**

**ముద్ర, నారాయణపేట :**
నారాయణపేట జిల్లా కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల సందడి జోరందుకుంది. రెండో రోజైన గురువారం మొత్తం 35మంది అభ్యర్థులు 36 నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో బీజేపీ నుంచి 10 మంది, కాంగ్రెస్ నుంచి 11మంది, టీఆర్ఎస్ నుంచి 12మంది, ఏఐఎంఐఎం నుంచి ఒకరు, టీడీపీ నుంచి ఒకరు, స్వతంత్రులుగా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

**నేడు భారీ ఎత్తున నామినేషన్లు వేసే అవకాశం..**
నేడు నామినేషన్లకు చివరి రోజు కావడంతో బి–ఫారంతో పెద్ద ఎత్తున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం టీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ కేంద్రం వద్ద ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నామినేషన్ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు విజయ్‌కుమార్, డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. 28న రెండు నామినేషన్లు దాఖలు కావడంతో పేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 38 నామినేషన్లు నమోదయ్యాయి.

**మద్దూర్, కోస్గి నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..**
మద్దూరు, కోస్గి మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, నామినేషన్ పత్రాలు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే అన్ని వార్డుల ఓటరు జాబితాలను సిద్ధంగా ఉంచాలని, వచ్చిన నామినేషన్లను వెంటనే స్కాన్ చేసి 'టి–పోల్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. కోస్గి మున్సిపాలిటీలో భద్రపరిచిన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ నిర్వహణకు అవసరమైన సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు.









## సీసీ రోడ్లకు వెంటనే నిధులు విడుదల చేయాలి

**కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్**



**ముద్ర, మల్కాజిగిరి:**
మౌలాలి డివిజన్ పరిధిలో ఇటీవల మంజూరైన తొమ్మిది సీసీ రోడ్లకు తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ జోనల్ కమిషనర్‌ను కోరారు. మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ చొరవతో, ఆయన సూచనల మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఈ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేసినట్లు తెలిపారు. జేబీఆర్ స్కూల్ రోడ్, శివానంద కాలనీ, షఫీ నగర్ హనుమాన్ టెంపుల్ రోడ్, పీబీ సూర్యనగర్ కాలనీ, సంతోష్ మా నగర్–రోడ్ నెం.7 (డీమార్ట్ ఎదురుగా), ఎంజే కాలనీ రోడ్, సుధా నగర్, రాక్ చర్చ్ రోడ్డు తదితర మొత్తం తొమ్మిది రోడ్లకు దాదాపు రెండు నెలల క్రితమే అనుమతులు లభించినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

## పార్కుల నిర్వహణపై మాజీ ఎమ్మెల్యే ఆరా

**ముద్ర, నారాయణపేట :**
నారాయణపేట జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గురువారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు, సైన్స్ పార్కులో కొంతసేపు వాకింగ్ చేస్తూ, ఆరోగ్యం కోసం పార్కుకు వచ్చిన వృద్ధులు, సీనియర్ సిటిజన్లతో సరదాగా ముచ్చటించారు. ఈసందర్భంగా పార్కుల నిర్వహణ సరిగా జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలం ప్రారంభమైతే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశముందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పార్కుల మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు ఒకసారి గుర్తుచేసుకొని, ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



## రూ.13 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**ముద్ర, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ శంకుస్థాపనలు చేశారు. చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.6.58 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయగా, మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.4.72 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. గచ్చిబౌలి ప్రాంతంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ అన్ని డివిజన్లను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వివిధ డివిజన్లలో జరిగిన శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలి

**ముద్ర, నారాయణపేట :**
యూరియా బుకింగ్ యాప్‌పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం మద్దూరు పట్టణంలోని 'మన గ్రోమోర్' సెంటర్‌తో పాటు కోస్గి పట్టణంలోని పీఏసీఎస్‌ను ఆమె సందర్శించి, యూరియా బుకింగ్ యాప్ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు యూరియాను



ఆన్‌లైన్‌లో ఎలా బుక్ చేసుకోవాలి, డీలర్లు అమ్మకాల ధృవీకరణ (సేల్స్ కన్ఫర్మేషన్) ఎలా చేయాలి అనే అంశాలపై రైతులు, డీలర్లకు కలెక్టర్ వివరించారు. యూరియా బుకింగ్ యాప్ ద్వారా రైతులు సులభంగా యూరియా పొందవచ్చని, ఎరువుల విక్రయాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఈ విధానం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. డీలర్లు, ఆగ్రోస్, పీఏసీఎస్ నిర్వాహకులు అందరూ ఆన్‌లైన్ ఎరువుల అమ్మకాల విధానంపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే నారాయణపేట జిల్లా, కోస్గి డివిజన్ పరిధిలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు.

## కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**ముద్ర, కాప్రా:**
జీహెచ్ఎంసీలో విలీనమైన శివారు మున్సిపాలిటీల పరిధిలోని కాలనీల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పననే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. గురువారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఎస్ఎస్ కాలనీ, శ్రీశక్తి నగర్ కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక సమస్యలను పరిశీలించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు బికుమల రమేష్‌గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, శంకరయ్య, నరసింహారెడ్డి, శంకర్, మల్లేష్, రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



**మేడారం జాతర విశేషాలు**

**విగ్రహాలు ఉండవు**

ఇక్కడ దైవానికి విగ్రహాలు ఉండవు, గద్దెలపై ప్రతిష్టించిన కుంకుమ భరిణెలనే భక్తులు అమ్మ వార్లుగా భావించి పూజిస్తారు.



# ఘనంగా కొత్తగట్టు మత్స్య గిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

## స్వామివారి కళ్యాణానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగట్టు శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు తాను అనేక సంవత్సరాలుగా హాజరవున్నానని తెలిపారు. గురువారం స్వామి వారి కళ్యాణం సందర్భంగా ప్రత్యేకంగా పాల్గొని ఆశీర్వాదం పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధి వర్షాలు కురిసి, పాడి పంటలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. స్వామి వారి ఆశీర్వచనం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారాన్ని సమన్వయం చేస్తూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

# సమ్మక్క సారలమ్మకు మంత్రి 'పొన్నం' ప్రత్యేక పూజలు



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో ఉన్న సమ్మక్క సారలమ్మ వారిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వనదేవతలైన సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని కోరుకున్నట్లు వెల్లడించారు. అనంతరం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తి గ్రామంలో ఉన్న సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కాంగ్రెస్ లో 'టికెట్' ఫైట్

- అధికార పార్టీలో 'అభ్యర్థుల' మథనం - గెలుపు గుర్రాల వేటలో అధిష్టానం! - తుమ్మల మార్క్ సర్వేతో నేతలకు షాక్!
- సర్వే రిపోర్టుల అస్త్రం: స్థానిక నేతలకు మంత్రి తుమ్మల చెక్! - గెలుపు గుర్రాల వేటలో గందరగోళం.. - 39 డివిజన్లకే గ్రీన్ సిగ్నల్!
- ఢిల్లీ లెవల్ లో స్కెచ్.. గల్లీలో ఫైట్ - సీసీ, సీఎంవోకు చేరిన జాబితా... - నేడో, రేపో మిగతావి ఖరారు... - ముగ్గురు మంత్రుల నిర్ణయమే కీలకం
- సీఎంవో గడప తొక్కిన అభ్యర్థుల జాబితా! - బీఫామ్ గడువు సమీపిస్తున్నా వీడని చిక్కుముడి - ఆశావహుల్లో టెన్షన్ టెన్షన్!





**కరీంనగర్, ముద్ర ప్రతినిధి :**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్నికల నగారా మోగక ముందే అధికార కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కేటాయింపు వ్యవహారం ఒక క్లిష్టమైన సవాలుగా పరిణమించింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి, అధిష్టాన వ్యూహానికి మధ్య జరుగుతున్న ఒక పెద్ద 'ఘర్షణ'గా కనిపిస్తోంది. గురువారం రాజధానిలో జరిగిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం ఈ పరిణామాలకు వేదికైంది.

### స్క్రీనింగ్ కమిటీలో 'హైడ్రామా'

జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు నివాసంలో జరిగిన ఈ సమావేశం ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ వంటి హేమాహేమీలు ఈ భేటీలో పాల్గొన్నారు. సుమారు 66 డివిజన్లలో అభ్యర్థుల ఎంపికపై జరిగిన ఈ చర్చల్లో నేతల మధ్య తీవ్ర వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. సుదీర్ఘ కసరత్తు తర్వాత కేవలం 39 డివిజన్లకు మాత్రమే అభ్యర్థులను ప్రాథమికంగా ఖరారు చేయగలిగారు.

### మంత్రి తుమ్మల 'మాస్టర్ ప్లాన్'

ఈ సమావేశంలో జిల్లా నేతలకు మంత్రి తుమ్మల షాక్ ఇచ్చారు. స్థానిక నేతలు తమ అనుచరుల పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేయగా, మంత్రి తన వద్ద ఉన్న మరో రహస్య జాబితాను తెరపైకి తెచ్చినట్టు సమాచారం.. కేవలం సిఫార్సుల ఆధారంగా కాకుండా, ఇంటెలిజెన్స్ నివేదికలు మరియు సునీల్ కనుగోలు నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయించాలని ఆయన స్పష్టం చేశారు. "పార్టీ విధేయత ఎంత ముఖ్యమో, అభ్యర్థి గెలిచే అవకాశం కూడా అంతే ముఖ్యం" అని ఆయన తేల్చి చెప్పడంతో స్థానిక నేతలు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

### గ్రూపు రాజకీయాల తలనొప్పి

టికెట్ల వేటలో ఉన్న నేతలు తమ అనుచరుల కోసం గట్టిగానే పట్టుబడుతున్నారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్లకు మళ్లీ టికెట్లు ఇవ్వడంపై పాత క్యాడర్ గుర్రుగా ఉంది. మైనారిటీలు అధికంగా ఉన్న డివిజన్లలో అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. తమ సామాజిక వర్గానికి లేదా తమ వర్గానికి చెందిన వారికే టికెట్లు దక్కాలని కొందరు కీలక నేతలు పట్టుబట్టడంతో సమావేశం పలుమార్లు అర్ధాంతరంగా నిలిచిపోయింది.

### ప్రకటనపై ఆచితూచి అడుగులు

ఖరారు చేసిన 39 మంది అభ్యర్థుల జాబితాను ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎంవో కార్యాలయానికి పంపారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కార్యాలయాలకు కూడా ఈ నివేదికలు చేరాయి.

ప్రస్తుతం పీసీసీ చీఫ్ మేడారం జాతరలో ఉండటంతో, ఆయన తిరిగి వచ్చిన తర్వాతే తుది ఆమోదం లభించనుంది. ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం వరకు బీ–ఫారమ్ సమర్పణకు గడువు ఉండటంతో, అప్పటి వరకు అభ్యర్థుల పేర్లను అత్యంత గోప్యంగా ఉంచాలని అధిష్టానం భావిస్తోంది. ముందస్తుగా పేర్లు ప్రకటిస్తే రెబల్స్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని పార్టీ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌పై జెండా ఎగుర వేయాలని పట్టుదలగా ఉన్న కాంగ్రెస్, అభ్యర్థుల ఎంపికలో ఏ చిన్న పొరపాటు జరగకుండా జాగ్రత్త పడుతోంది. మంత్రి తుమ్మల వ్యూహాలు, స్థానిక నేతల ఒత్తిళ్ల మధ్య చివరకు ఏ జాబితా నెగ్గుతుందో చూడాలి. ఏది ఏమైనా, ఈ 'టికెట్ వార్' కరీంనగర్ కాంగ్రెస్‌లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది.

# బాల సదనం, రక్తసంబంధీకుల నుండి పిల్లల దత్తత

## ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్

**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఏడు సంవత్సరాల బాలికను హైదరాబాద్ కు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. కరీంనగర్ అర్బన్ పరిధిలోని గోపాల్ పూర్ కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి సమీప బంధువుల నుండి 13 సంవత్సరాల బాబును దత్తత తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతులమీదుగా ఈ దత్తత కార్యక్రమం కలెక్టరేట్లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. రక్త సంబంధీకుల నుండి దత్తత తీసుకోవాలనుకునే వారు, బాల సదనాల నుండి దత్తత కోరుకునేవారు జిల్లా పరిషత్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దుర్గాన పర్వీన్, సిడబ్ల్యుసి మెంబర్లు కళింగ శేఖర్, విజయ్ కుమార్, ఎల్.పి.ఓ రాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది తిరుపతి, సాధినేని రమేష్, కవిత, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**ముద్ర, కరీంనగర్:**
ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి గురువారం పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొర పాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

### కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.

### చొప్పదండి నామినేషన్ కేంద్రాల పరిశీలన

చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. చొప్పదండి వార్డు స్థానాలకు అప్పటి వరకు దాఖలైన నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

# పని దినాలు పెంచినందుకు ఉపాధి హామీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలా..?

## గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడం కోసమే విబిజి రామ్ జీ చట్టం.. మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**ముద్ర, కరీంనగర్:**
ఉపాధి హామీ పథకంలో విప్లవాత్మక మార్పులు తెస్తూ, కూలీల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వికసిత భారత్ గ్యారెంటీ వి బి జి బిరామ్ జీ – 2025' చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడం దారుణమని, పని దినాల పెంపే లక్ష్యంగా, గ్రామ స్వరాజ్యం బలోపేతమే లక్ష్యంగా తీసుకువచ్చిన వి బి జి రామ్ చట్టంపై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తుందని , కేవలం వి బి జి రామ్ చట్టంలో 'రామ్' అనే పేరున్నందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం ఆ పార్టీ దివాళా కోరుతనానికి నిదర్శనమని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. గురువారం మానకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడారు. వి బి జి రామ్ చట్టంపై బుధవారం మానకొండూరులో తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ చేసిన వ్యాఖ్యలను బిజెపి జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విబిజి రామ్ చట్టంపై దుష్ప్రచారం చేయడం, ప్రజలను తప్పుదారి పట్టించడమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యవహరించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ మంచి పని చేపట్టినా అడ్డుపడటమే కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని ఆయన ఘాటుగా విమర్శించారు. 11 ఏళ్లలో మోడీ ప్రభుత్వం తీసుకున్న అనేక చారిత్రాత్మక నిర్ణయాలను వ్యతిరేకించిన కాంగ్రెస్ ను దేశ ప్రజలు ఇప్పటికే తిరస్కరించిన ఇంకా ఆ పార్టీకి బుద్ధి రావడం లేదన్నారు. దేశ ప్రజల కోసం, దేశహితం కోసం పనిచేస్తున్న భారతీయ జనతా పార్టీ ప్రజల మద్దతుతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలతో నేడు కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితం చేసినా ఆ పార్టీ తీరు మారలేదని ఎద్దేవా చేశారు. ప్రధానంగా వి బి జి రామ్ చట్టంపై కూలీలకు ఏటా 125 రోజుల పని కల్పించే చట్టబద్ధమైన గ్యారెంటీ, పనిచేసిన 15 రోజుల్లోపే నేరుగా ఖాతాల్లోకి వేతనాల జమ, దేశవ్యాప్తంగా ఉపాధి హామీ బడ్జెట్ ను రూ. 86 వేల కోట్ల నుంచి రూ.1.50 లక్షల కోట్లకు పెంచడం జరిగిందని తెలిపారు. చట్టం వల్ల తెలంగాణకు అదనంగా రూ. 346 కోట్ల నిధులను కేటాయించి ఉపాధి కూలీలకు కేంద్రం అండగా నిలబడిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టంపై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని బీజేపీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి, భూగర్భ జలాల పెంపునకు, మౌలిక వసతుల కల్పనకు ఈ చట్టం ఎంతో దోహదపడుతుందని వివరించారు. కూలీల కడుపు కొట్టేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ కు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కందిరాజి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల, వెంకట్ రెడ్డి, రంగు భాస్కరాచారి, వి బి జి రామ్ జి జిల్లా కన్వీనర్ కరివేద మహిపాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అప్పని తిరుపతి, మాజీ మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్,మియపురం లక్ష్మణచారి, సోన్నకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్ గౌడ్, బొగ్గుల రమేష్, వార్డు సభ్యులు భాష బోయిన ప్రదీప్ యాదవ్, మార్కొండ రమేష్ పటేల్, పోచంపల్లి శ్రీనివాస్,మీసా రమణయ్య, కొండ్ర వరప్రసాద్, మాదాసు కుమార్, మీసా రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మేడారం జాతర విశేషాలు**

బంగారం సమర్పణ: భక్తులు తమ కోరికలు తీరినందుకు మొక్కుబడిగా తమ బరువుకు తూగే బెల్లాన్ని (దీనిని 'బంగారం' అంటారు) అమ్మవార్లకు సమర్పించుకుంటారు.





## 1592 కేజీల నిషేధిత గంజాయి దహనం

**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:**

జిల్లాలోని 08 పోలీస్ స్టేషన్లలో నమోదైన 13 కేసుల్లో వివిధ సందర్భాల్లో నిందితుల వద్ద నుండి సీజ్ చేసిన 1592 కేజిల నిషేధిత గంజాయిని తల్లాడ మండలం గోపాలపేట లోని బయో డిస్పోజల్ ప్లాంట్ పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారుగా రూ.7 కోట్ల 96 లక్షలు ఉంటుంది. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ అయిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనలతో సభ్యులైన పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కోర్టు వారి అనుమతి తీసుకుని ఈ నిషేధిత గంజాయిని గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు దశల వారీగా విభజించి దహనం చేశారు. ఎన్డీపీఎస్ యాక్ట్ లోని నియమ నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేశామని ఎస్పీ తెలియజేశారు. ఎవరైనా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# పదేళ్ల కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
# రెండేళ్లలో.. కాంగ్రెస్ చేసింది శూన్యం

- **ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**

**ముద్ర, ఖమ్మం :**

బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా.. రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. వైరా పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..., బీఆర్ఎస్-సీపీఎం పార్టీల సమన్వయంతో ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులకు ప్రజలు తమ పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తాతా మధు విమర్శించారు. గ్యారెంటీలు, హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ పాలనలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు తీర్పు చెప్పే అవకాశం అని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ 'బాకీ కార్డు' కార్యక్రమాన్ని చేపట్టిందని, ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నేతలను ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు బానోత్ చంద్రావతి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ సెక్రటరీ వీరభద్రం, నియోజకవర్గ నాయకురాలు బానోత్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, వైరా రూరల్, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, వనమా వీశ్వేశ్వరరావు, ఖమ్మం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నగర బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## స్వామివారికి తిరుప్పావడ సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దిట్టకవి శ్రవణాచార్యులు మాట్లాడుతూ.. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారని చెప్పారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుందని అప్పుడు సుమారు 450 కిలోల అన్నప్రసాదాన్ని, లడ్డు, వడ తదితర పిండివంటలను శ్రీవారికి నైవేద్యం చేస్తారని చెప్పారు. వేదమంత్రోచ్ఛారణలతో అర్చించి కర్పూరమంగళ హారతులు సమర్పించారు. స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్న ప్రసాద వితరణలో 3,000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధుల లో శోభాయమానంగా ఊరేగిస్తూ, భక్తుల గోవింద నామస్మరణలతో, మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.





## కన్నులపండువగా 'శ్రీ సీతారామచంద్ర స్వామి తిరు కల్యాణం

**ముద్ర, ఖమ్మం:**

నగరంలోని బ్యాంక్ కాలనీ వీడీఓఎస్ కాలనీలో వెలసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుండే ఆలయంలో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృత తిరుమంజనం నిర్వహించారు. శ్రీ రామనామ తారక మంత్ర హవనం, శ్రీ మన్యు సూక్త హనుమత్ హవనాలతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. సాయంత్రం 7 గంటలకు వేద మంత్రాల సాక్షిగా, భక్తుల జయజయధ్వానాల మధ్య శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.

**భారీ అన్నదానం:**

కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ విశేషంగా సాగింది. సుమారు 2 వేల మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నేటి కార్యక్రమాలు**

ఉదయం 8 గంటలకు సర్వదేవత్య హోమం, సుదర్శన హోమం, చక్రస్నానం మరియు పూర్ణాహుతి
సాయంత్రం 6 గంటలకు ద్వాదశి ప్రదక్షిణలు (పల్లకి సేవ), గరుడ ప్రసాద వితరణ, ఊంజల్ సేవ మరియు మహాదాశీర్వచనం

## నామినేషన్ వేసిన గుర్రాల సంతోష శ్రీనివాస్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మున్సిపాలిటీలోని 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుర్రాల సంతోష శ్రీనివాస్ భారీ ర్యాలీతో వెళ్లి గురువారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు మార్పు కోసం ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ మాట్లాడుతూ.. అభ్యర్థి గుర్రాల సంతోష శ్రీనివాస్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ నాయకులు గుర్రాల శ్రీనివాస్, రాచకొండ మహేష్ పాల్గొన్నారు.



## భువనగిరిలో 114 నామినేషన్లు దాఖలు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపాలిటీలో రెండో రోజు గురువారం 109 నామినేషన్లు దాఖలు చేశారు. మొదటిరోజు ఐదు నామినేషన్లు రెండో రోజు 109 నామినేషన్లు దాఖలు కాగా మొత్తం 114 నామినేషన్లో దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. ఇందులో బీఎస్పీ 2, బిజెపి 28, సిపిఐ 1,కాంగ్రెస్ 32,బిఆర్ఎస్ 34,స్వతంత్రులు 16 నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.





## సమ్మెను జయప్రదం చేయండి

- **భవన్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ పిలుపు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

దేశ వ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని తెలంగాణ భవన్ నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు, గౌరిగి సోములు పిలుపునిచ్చారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో తెలంగాణ భవన నిర్మాణ నిర్మాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్ డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో కార్మిక వర్గం హక్కులను తుంగలో తొక్కుతూ కార్మిక వర్గాన్ని పెట్టి చాకిరి చేయించుకుంటున్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను దేశంలో ఉన్న కార్పొరేట్ శక్తులకు అంబానీలకు అప్పజెప్పి వారి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నదన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న వలస కార్మికుల చట్టం వెల్ఫేర్ బోర్డును లేకుండా చూస్తున్నారని, ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మాతయ్య, భవనిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రాధార మల్లేశం, నాయకులు వెంకటేశం, ఈశ్వరయ్య, మారయ్య, రాధాకృష్ణ, ఎల్లా స్వామి, ప్రసాద్, ఎస్ కే శీను పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

వికలాంగులకు హక్కుల జాతీయ వేదిక ఎన్ పి ఆర్ డి రాష్ట్ర కమిటీ క్యాలెండర్ ను యాదగిరిగుట్ట ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.పి.ఆర్.డి జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా నాయకులు పి విజయకుమార్ పాల్గొన్నారు.



## బాల్య వివాహాలను నివారించాలి

**ముద్ర నడిగూడెం:**

బాల్య వివాహాలు జరగకుండా నివారించేందుకు గురువారం మండల పరిధిలోనిచెన్నకేశవపురం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టపరమైన చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సదస్సులో గ్రామ సర్పంచ్ గోసుల రాజేష్,ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య పాల్గొని మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, అలాంటి వివాహాలు నిర్వహించిన వారికి కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలిపారు.పిల్లల చదువు, ఆరోగ్యం,భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్థులందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా గ్రామ ప్రజల్లో బాల్య వివాహాలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందని అన్నారు.



## అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా..

- **బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముస్తాల హేమలత అనంద్**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

భువనగిరి మున్సిపాలిటీలోని 32వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ముస్తాల హేమలత ఆనంద్ భారీ ప్రదర్శనగా వెళ్లి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా హేమలత ఆనంద్ మాట్లాడుతూ.. 32వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్దే తప్పా.. కాంగ్రెస్ చేసిందేమీ లేదని అన్నారు. వార్డు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా అని అన్నారు. వార్డు భవిష్యత్ కోసం తనకు అవకాశం కల్పించి, ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షులు ముస్తాల ఆనంద్, చంద్రగిరి వెంకటేష్, కానుకుంట్ల కుమార్, బిల్లా శివ, భూషాపక సుధాకర్, ఎండి.ముజాంబిల్, ఎండి.అఫ్జల్, ఎండి. ఉమర్, సాంద్ర చంద్రమౌళి, పొన్నాల కుమార్, పత్తి కొండల్, పత్తి సుధాకర్,మందుల సువర్ణ,నందిత ధనమ్మ, పత్తి పద్మ,నీల లక్ష్మి,బిల్లా భాగ్యమ్మ,సొప్పేజు విజయలక్ష్మి,ఎస్.ముత్యాలమ్మ పుట్ట నాగమ్మ,వార్డు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



**మేడారం జాతర విశేషాలు**



**జంపన్న వాగు స్నానం:** జాతరకు వచ్చే భక్తులు ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, ఆ తర్వాతే అమ్మవార్ల దర్శనానికి వెళ్తారు.

# రైతుల నోట్లో మట్టి కొట్టొద్దు

**- కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేదు**
**- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** రైతుల నోట్లో మట్టి కొట్టద్దని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ రైతులకు ఇవ్వడానికి లేని నీళ్లు బీరు ఫ్యాక్టరీలకు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ కార్యదర్శి స్వయంగా వచ్చి బీరు ఫ్యాక్టరీలకు నీళ్లు ఆపొద్దు, ఫుల్ గా ఇవ్వండి అని ఆదేశాలు ఇస్తున్నారన్నారు. రైతుల కంటే బీరు ఫ్యాక్టరీల ఓనర్లు ఇచ్చే లంచాలు, కమిషన్లే ముఖ్యమా అని నిలదీశారు. రైతులు లంచాలు ఇవ్వరని వారి పంటలను ఎండబెడతారా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కందులకు క్వింటాల్ కు ఎనిమిది వేల రూపాయల మద్దతు ధర నిర్ణయించిందన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన దేశంలో నూనె గింజలు, పప్పు దినుసుల కొరత ఉందన్నారు. అందుకే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా సన్ ఫ్లవర్, ఆయిల్ పామ్, పప్పు దినుసులు సాగు చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. చీడపీడలు తగ్గి, అధిక లాభాలు వస్తాయన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. ఎరువుల కోసం మళ్లీ చెప్పులు లైన్లో పెట్టే రోజులొచ్చాయన్నారు. బీజేపీ ప్రభుత్వం సబ్సిడీలకు కోత పెట్టాలని ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల పంపిణీలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ ఎరువులకు కొరత రాలేదన్నారు. కరోనా వచ్చినా, నోట్లు రద్దయినా రైతులకు ఇబ్బంది రాలేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ వచ్చాక మళ్లీ ఎరువుల కోసం తెల్లవారుజామున 3 గంటలకు వచ్చి క్యూ లైన్లలో చెప్పులు పెట్టి నిలబడే చీకటి రోజులను తీసుకు వచ్చారన్నారు. యూరియా దొరక్క రైతులు ప్రైవేటులో అధిక ధరలకు లిక్విడ్ ఎరువులు కొంటూ నష్టపోతున్నారు. ఫిబ్రవరి వచ్చినా రైతు బంధు జాడ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి సాగు పనులు సాగుతున్నాయి. దుక్కి దున్ని, నాట్లు వేసి, కలుపు తీసి ఎరువులు వేసే సమయం ఇదన్నారు. కేసీఆర్ హయాంలో డిసెంబర్ లోనే రైతు బంధు టింగు టింగుమని ఫోన్లలో మోగేదన్నారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశానిర్దేశం లేదన్నారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో స్పష్టత లేదన్నారు. రైతులు వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారని, ఆ మిత్తీల భారం రైతుల మీదే పడుతోందన్నారు. రైతులకు నీళ్లు బంద్.. బీరు ఫ్యాక్ట రీలకు నీళ్లు మాత్రం ఫుల్ అని ఎద్దేవా చేశారు. మెదక్ జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. సింగూరు ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాలు, గణపురం ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. కారణం అడిగితే రిపేర్లు ఉన్నాయి, నీళ్లు లేవు అంటున్నారని చెప్పారు. కేసీఆర్ పాలనలో ఎప్పుడూ క్రాప్ హాలిడే లేదన్నారు. పోయిన వానాకాలంలో వడగండ్ల వాన వల్ల పంట నష్టపోతే, ముఖ్యమంత్రి హెలికాప్టర్లో వచ్చి ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. ఏడాది గడిచినా ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. మొన్నటి తుఫాను నష్టానికీ పరిహారం లేదన్నారు. బోనస్ పైసలు సగం మందికే ఇచ్చారన్నారు, మిగతా వారికి దిక్కులేదన్నారు. పోయిన యాసంగి బోనస్ రూ.1,100 కోట్లు పెండింగ్ ఉందన్నారు..

**గోడు పట్టించుకోని పాలకులు..**

ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల గోడు పట్టడం లేదన్నారు. ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం, సిట్ నోటీసులు ఇవ్వడం మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపులు పక్కన పెట్టి పెండింగ్ లో ఉన్న రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేయాలలని డిమాండ్ చేశారు. వానాకాలం, యాసంగికి సంబంధించిన పెండింగ్ బోనస్ డబ్బులు చెల్లించాలన్నారు. వడగండ్ల వాన, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే అందించాలని, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. లేనిచో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## నియంతృత్వ పోకడలకు అడ్డుకట్ట తప్పదు

**మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్**



**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ప్రజలే అడ్డుకట్టవేస్తారని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ అధికార దుర్వినియోగనికి పరాకాష్ట అని మండిపడ్డారు. పరిపాలన విధివిధానాలు తెలియని వాళ్లు పాలకులుగా ఉండటం దురదృష్టకరమన్నారు.

## సిద్దిపేటలో బీఆర్ఎస్ పునాదులు కదిలిస్తాం

**తెలంగాణ జాగృతి జిల్లా నేత మిట్టపల్లి శ్రీనివాస్ ముదిరాజ్**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** సిద్దిపేటలో బిఆర్ ఎస్ పునాదులు కదిలిస్తామని తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు సిద్ధర బోయిన శ్రీనివాస్ ముదిరాజ్ (మిట్టపల్లి) హెచ్చరించారు. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్లో నతెలంగాణ జాగృతి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి మహిళా ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల కవిత అవడం ఖాయమన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై తెలంగాణ జాగృతి అన్ని మున్సిపాలిటీలలో పోటీ చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకే తమ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. సిద్దిపేటలో రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ పునాదులు పెకలించడం ఖాయమన్నారు. మరి కొద్ది రోజుల్లోనే సిద్దిపేట నుండి కల్వకుంట్ల కవిత ఎన్నికల సమర శంఖం పూరిస్తారని తెలిపారు. సిద్దిపేట ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు కవితకు ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ జాగృతి అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి నాయకులు వర్కోలు శ్రీనివాస్, ఏ. బాలయ్య, కొనయాపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## షోరూంలోనే వాహన రిజిస్ట్రేషన్

**ముద్ర ప్రతినిధి,** మెదక్: నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కొనుగోలు చేసేవారు రిజి స్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండ దు. కార్లు, ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసిన వారు ఇకపై షోరూంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి వెంకటస్వామి తెలిపారు. రవాణా శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానం ఈ నెల 24 నుంచి జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ షోరూంలో వాహనదారులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23 వరకు కొనుగోలు చేసిన వాహనాలకు మాత్రం రవాణా శాఖ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ జరుగుతుందని డీటీఓ తెలిపారు. అలాగే, వాణిజ్య వాహనాలకు సంబంధించి రవాణా శాఖ కార్యాలయానికే రావాన్నారు.

## కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం దుర్మార్గం

**ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



**ముద్ర, | నిజామాబాద్:** తెలంగాణ సాధకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసు పేరిట సిట్ నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన, కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనమని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్, కమిషన్లు ఏమీ చేయలేవన్నారు. కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసులు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణకు ప్రతిరూపమైన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే యావత్ తెలంగాణ సమాజానికే నోటీసులు ఇచ్చినట్టేనని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడిగా, రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లో తీవ్ర అభద్రతా భావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో కప్పిపుచ్చుకునేందు సిట్‌లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజలను కన్ఫ్యూజ్ చేయాలన్న దురుద్దేశంతోనే ఈ నోటీసుల డ్రామా చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాదు కానీ.. పూటకో డైవర్షన్ డ్రామాలు చేస్తూ రేవంత్ రెడ్డి కాలం గడుపుతున్నాడని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవివేకపూరిత, పిల్ల చేష్టలతో కూడిన పాలనలో ప్రభుత్వ సంస్థలు స్వతంత్రత కోల్పోయి కేవలం కీలుబొమ్మలుగా మారాయాన్నారు.

తెలంగాణ చరిత్రను లిఖించిన నాయకుడు, రాష్ట్రాన్ని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిపిన కేసీఆర్ వ్యక్తిత్వానికి, ప్రతిష్టకు రేవంత్ రెడ్డి పిల్ల చేష్టలతో మలినం అంటించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఇలాంటి కక్షసాధింపు చర్యలు చివరికి ఆయనే ప్రజల్లో నవ్వులపాలవుతారని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను వ్యక్తిగత రాజకీయ అవసరాల కోసం దుర్వినియోగం చేయడం దురదృష్టకరమని, సిట్‌లు, కమిషన్ల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలైన స్వభావాన్ని బయట పెడుతోందన్నారు.

కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి రేవంత్ రెడ్డి తానే తన రాజకీయ సమాధిని తానే రాసుకున్నాడని వ్యాఖ్యనించారు. సిట్‌లు, కమిషన్లు, అక్రమ కేసులతో కేసీఆర్‌ను ఏమీ చేయలేరని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే నిలబడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు, ఎన్ని డైవర్షన్ రాజకీయాలు చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ ఎండగడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్టస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి తగిన మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రం పరిశీలన



**ముద్ర, హైదరాబాద్:** జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని గురువారం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు రంగ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. చెన్నూరు మున్సిపల్ పరిధిలోని 37 వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్‌లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంమబటల వరకు చేపట్టాలని, నామినేషన్ పత్రాల పరిశీలన, ఉప సంహరణ, అభ్యర్థుల జాబితా, గుర్తుల కేటాయింపులలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని ఎక్కడ పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు నామినేషన్‌పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలో అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్‌డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జహీరాబాద్ ఆర్డిఓ దేవుజ, ప్రత్యేక మున్సిపల్ కమిషనర్ జైతురాం, తాసిల్దార్ దశరథ్ తదితరులు ఉన్నారు.

## సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం




**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మండల స్థాయి సీఎం కప్ క్రీడలను ఎంపీడీవో చందర్ స్థానిక నాయకులతో కలిసి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కప్ పోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి యువకుల నైపుణ్యాలను వెలికి తీయడం కోసమే క్రీడలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మండ్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, నాయకులు పుప్పాల శంకర్, గంట్ల విఠల్, కాషా గౌడ్, శాంతిశ్వర్ పటేల్, ఏజాజ్ ఖాన్, పూల కంటి సాయిలు, మండలంలోని పలు గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కాస్తులో ఉన్న స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



**ముద్ర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా నాగిరెడ్డి పేట్ మండలం తాండూర్ గ్రామ శివారులో తాము ఆరేళ్లుగా కాస్తులో ఉన్న స్థలాలకు పట్టాలని ఇవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తమ కుటుంబాలను ఆదుకోవాలంటూ నినాదాలు చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రాజేశ్వర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తాము ఏ ఆధారం లేకుండా ఈ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, కావున తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రెండో రోజు 286 నామినేషన్లు

**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లాలో రెండవ రోజు 286 నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ లో 115, రామాయంపేలో 58, తుప్రాన్ లో 52, నర్సాపూర్ లో 61 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నుండి అభ్యర్థులు పోటీకి ఉత్సాహం చూపుతున్నారు. కాంగ్రెస్ –106, బీఆర్ఎస్–96, బీజేపీ 51, బీఎస్పీ–1, సిపిఐ–1, ఎంఐఎం –3, ఇతరులు –29 ఉన్నాయి.

మెదక్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు టి. రవి కిరణ్ సందర్శించారు. జిల్లాలో ఎన్నికల తీరు, మున్సిపాలిటీలను, మున్సిపాలిటీలో వార్డుల గురించి కలెక్టర్ రాహుల్ రాజ్ సాధారణ పరిశీలకులు రవి కిరణ్ కు వివరించారు.

**మేడారం జాతర విశేషాలు**

ప్రభుత్వ గుర్తింపు: 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించింది, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.



# ఏడు శాతం దిశగా భారత్ వృద్ధి బాట..

- **ఆర్థిక సర్వేలో వెల్లడి**
- **2026–27లో 6.8–7.2% వృద్ధి సాధ్యమని అంచనా**
- **గ్లోబల్ హెడ్‌విండ్స్ మధ్య భారత ఆర్థిక వ్యవస్థకు స్థిరత్వం**
- **గతేడాది వృద్ధి రేటు సుమారు 7.4% వరకు ఉంటుందని విశ్లేషణ**
- **దేశీయ వినియోగం, పెట్టుబడులు, సేవల రంగం వృద్ధికి ప్రధాన బలం**
- **కేంద్ర బడ్జెట్‌కు ముందే విడుదలై విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం**

**ముద్ర న్యూస్:**

ఆర్థిక సర్వే 2026 ప్రకారం, భారత ఆర్థిక వ్యవస్థ FY27 (2026-27)లో 6.8 శాతం నుంచి 7.2 శాతం మధ్య వృద్ధి నమోదు చేసే అవకాశముందని అంచనా వేయబడింది. ఇది ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారత్ నిలకడగా, స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగుతున్నట్లు సూచిస్తుంది. అంతేకాదు, గ్లోబల్ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ బలమైన స్థితిలో కొనసాగుతోందని సర్వే స్పష్టం చేసింది.

గత ఆర్థిక సంవత్సరం అయిన FY25-26కు సంబంధించి, భారత ఆర్థిక వృద్ధి రేటు సుమారు 7.4 శాతం వరకు ఉండవచ్చని సర్వే అంచనా వేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న "గ్లోబల్ హెడ్‌విండ్స్" మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ తన స్థిరత్వాన్ని, వృద్ధి సామర్థ్యాన్ని నిలబెట్టుకున్నదని సూచిస్తుంది. దేశీయ వినియోగం, పెట్టుబడులు, సేవల రంగం ఈ వృద్ధికి ముఖ్యమైన తోడ్పాటును అందించినట్లు విశ్లేషణలో వెల్లడైంది.

ఆర్థిక స్థితి, ఫిస్కల్ హెల్త్ అంశాలపై కూడా ఆర్థిక సర్వే విస్తృతంగా విశ్లేషించింది. ప్రభుత్వ ఆదాయం-ఖర్చులు, ఫిస్కల్ డెఫిసిట్-జీడీపీ నిష్పత్తి, అప్పుల స్థితి వంటి కీలక ఆర్థిక సూచికలను సవివరంగా పరిశీలించింది. ఈ విశ్లేషణ బడ్జెట్‌కు ముందే విధాన నిర్ణయాల కోసం అవసరమైన దిశానిర్దేశం, ముందస్తు అవగాహనను పాలకులకు అందిస్తుంది.

ఆర్థిక సర్వే ఉద్దేశ్యం దేశం మొత్తం ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా విశ్లేషించడం. ఇది సంవత్సరాంతర ఆర్థిక ప్రగతి, వృద్ధి ధోరణులను రెండు భాగాలుగా విభజించి వివరిస్తుంది.



మొదటి భాగంలో GDP వృద్ధి, ద్రవ్యోల్బణం, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగం వంటి ప్రధాన మాక్రో-ఆర్థిక అంశాలపై దృష్టి సారించబడుతుంది. రెండో భాగంలో ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, పేదరికం వంటి సామాజిక-ఆర్థిక సమస్యలపై విశ్లేషణ ఉంటుంది.

ఇతర కీలక అంశాలలో ఉద్యోగాలు, కార్మిక మార్కెట్ ముఖ్యమైన స్థానం పొందాయి. లేబర్ మార్కెట్ పరిస్థితులు, ఉద్యోగ సృష్టి ధోరణులు, పని అవకాశాల్లో మార్పులు వంటి అంశాలను సర్వే ప్రత్యేకంగా అధ్యయనం చేసింది.

ఆర్థిక సర్వే గురువారం పార్లమెంటులో టేబుల్ చేయగా, ఇది ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టే కేంద్ర బడ్జెట్‌కు ముందే విడుదలైంది. దీని ద్వారా బడ్జెట్ ప్రాధాన్యతలకు స్పష్టమైన ఆర్థిక నేపథ్యాన్ని, విధానపరమైన మద్దతును అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆర్థిక సర్వే 2026లో భారత ఆర్థిక వృద్ధి అంచనా 6.8-7.2 శాతం, గత సంవత్సరం వృద్ధి అంచనా సుమారు 7.4 శాతం, ఫిస్కల్ వ్యవస్థలో ఆదాయం-ఖర్చుల సమతుల్యం, వ్యవసాయం, సేవల రంగాల ప్రదర్శన, ఉద్యోగ పరిస్థితులపై కొనసాగుతున్న విశ్లేషణ ప్రధానాంశాలుగా నిలిచాయి.

## కేసీఆర్ పాలనకు గుర్తింపు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి.

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా, రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అంటే 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు. అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్థసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది.

**మిషన్ కాకతీయ అద్భుతం..**

అందులో ఒకటి మిషన్ కాకతీయ. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. దీని వల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడా సాగునీరు అందింది. వీటితో పాటు చెక్ డ్యామ్‌ల నిర్మాణం, కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్థవంతంగా సాగు చేసుకునేలా ప్రోత్సహించింది. వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.



# ప్రిన్సిపాల్ ని గదిలో బంధించిన విద్యార్థులు

- **ప్రిన్సిపాల్ ని గదిలో బందించిన విద్యార్థులు**
- **పీజీ హాస్టల్ లో మెస్ ఏర్పాటు చేయాలని డిమాండ్**
- **కళాశాల ఎదుట ధర్నా**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పీజీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ రవినాథ్ ను గదిలో బందించి బయట నుంచి తాళం వేశారు. అనంతరం కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో హాస్టల్ ఏర్పాటు చేసి మెస్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారని, అందుకే తాము అడ్మిషన్ తీసుకున్నామన్నారు. హాస్టల్ ఏర్పాటు చేసిన ఇప్పటివరకు మెస్ సౌకర్యం కల్పించలేదని ఆరోపించారు. దీంతో తాము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడ్డారు. గతంలో రెండు సార్లు హాస్టల్ భవనంలో గ్యాస్ లేకేజీ అయిందన్నారు. ఏదైనా సంఘటనలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. తాము ఎంతో దూరం నుంచి వచ్చి ఇక్కడ అడ్మిషన్లు తీసుకున్నామని తెలిపారు. కాని మెస్ లేకపోవడంతో పరీక్షల సమయం లో వంట చేసుకోక పస్తులు ఉంటున్నామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందుకే ప్రిన్సిపాల్ ను గదిలో బందించామన్నారు. యూనివర్సిటీ మేనేజ్ మెంట్ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో హాస్టల్ లో మెస్ ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆ ప్రచారం పూర్తిగా అవాస్తవం: సజ్జనార్

- **బంగారంపై నిశ్చింతగా ఉండండి**

**ముద్ర న్యూస్ :**

బంగారం రేట్లు పెరగడంతో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగిపోయాయని, అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్‌లో మకాం వేశాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటివి నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తూ 'ఎక్స్'లో ఆయన పోస్టు పెట్టారు.



"దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధ్రువీకరించని వార్తలను, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయకండి. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితం. శాంతిభద్రతల పరిరక్షణలో మాకు సహకరించండి. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్ చేయండి. నిశ్చింతగా ఉండండి. మీ భద్రతే మా బాధ్యత!!" అని పేర్కొన్నారు.

# చేసేదేమో హోంగార్డు ఉద్యోగం..
# ఆస్తులేమో 20 కోట్లు..

- **ఏసీబీ అధికారులకే దిమ్మ తిరిగిపోయింది!**

**ముద్ర డెస్క్ :**

ఇప్పటివరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు చేసిన తనిఖీలలో ఉన్నత హోదాలలో పనిచేసిన ఉద్యోగులు మాత్రమే దొరికారు. వారు మాత్రమే ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. కానీ చరిత్రలో తొలిసారిగా ఓ హోంగార్డ్ అదాయానికి మించి కాదు.. అంతకుమించి అనే స్థాయిలో ఆస్తులను సంపాదించాడు. ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు రావడంతో సదరు హోంగార్డు మీద దృష్టి పెట్టారు. ఆ తర్వాత ఆయన బాగోతం కథలు కథలుగా బయటపడింది.



అతడి పేరు శ్రీనివాసరావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా పని చేస్తూ ఉంటాడు. అతడు గతంలో ఏసీబీ శాఖలో దాదాపు 15 సంవత్సరాలుగా పనిచేశాడు. అతను పని చేస్తున్న క్రమంలో ముందుగా దాడుల గురించి సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేసేవాడు. తద్వారా వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసేవాడు. ఉన్నతాధికారుల అండతో.. వారికి రకరకాల సపర్యలు చేసి 15 సంవత్సరాల పాటు ఏసీబీలో ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకున్నాడు. 15 సంవత్సరాలు కాలంలో అతడు దాదాపుగా 20 కోట్ల వరకు ఆస్తులను కూడ పెట్టాడు.

తన మీద ఏమాత్రం అనుమానం రాకుండా ఉండడానికి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవాడు. డబ్బులు కూడా నేరుగా తీసుకునేవాడు కాదు. అయితే ఇటీవల కాలంలో అతని ఆస్తులు అంతకంతకు పెరగడం.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇతడి గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో శ్రీనివాసరావు మీద దృష్టి పెట్టారు. అతడి ఆస్తులు.. వాడుతున్న ఫోన్లు.. ఖరీదైన లైఫ్ స్టైల్ చూసి ఉన్నతాధికారులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత అన్ని వివరాలు సేకరించి గురువారం అతని ఇంట్లో సోదాలు మొదలుపెట్టారు.

ఏసీబీ అధికారులు విజయనగరం, గుర్ల, విశాఖపట్నంలో తనిఖీలు నిర్వహించారు. దాదాపు 20 కోట్ల ఆస్తులను గుర్తించారు. ఖరీదైన ఇళ్ల స్థలాలు.. గృహాలు.. బంగారం, నగదు, వ్యవసాయ భూములు అతడు సంపాదించినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. అయితే ఇతడు సంపాదించిన ఆస్తులు మొత్తం కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే ఇటీవల కాలంలో అతడు ఖరీదైన వాహనాలలో తిరగడం పోలీసు ఉన్నతాధికారుల కంటపడింది. ఆ తర్వాత అతని గురించి వరుసగా ఫిర్యాదులు రావడంతో లోతుగా దర్యాప్తు మొదలుపెట్టారు. అనంతరం అతడు సంపాదించిన సంపాదన.. చేస్తున్న లాబింగ్ వ్యవహారాలు మొత్తం పోలీసులకు తెలిసిపోయాయి. దీంతో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేయడంతో శ్రీనివాసరావు బండారం మొత్తం బయటపడింది.



# మానవాళికి ఏఐ షాక్..

- **2008లా రాబోయే సంక్షోభం అదే!**

**ముద్ర, డెస్క్ :**

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని అత్యంత సులభతరం చేసింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులు మనిషి జీవితంలో ఊహించని విధంగా సంచలనాలు సృష్టిస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు ఎంతయితే మంచిని ఇస్తున్నాయో.. అంతే స్థాయిలో చెడును కూడా ఇస్తున్నాయి.

శాస్త్ర సాంకేతిక రంగం వల్ల మనిషి జీవితం సుఖవంతమైన మాట వాస్తవమే.. ఇదే స్థాయిలో కష్టాలు కూడా వస్తున్నాయి. నష్టాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వీటివల్ల మనుషులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, ఇంకా అనేక విధాలుగా మనుషులు నష్టపోతున్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పుల వల్ల ఇటీవల కాలంలో కృత్రిమ మేధ అనేది అందుబాటులోకి వచ్చింది. ఇది మనిషి జీవితాన్ని మరోవైపు తీసుకెళ్తోంది. రక్షణ రంగం నుంచి మొదలుపెడితే వైద్యరంగం వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేనిదే పనులు జరగని పరిస్థితి నెలకొంది. ఇది ఎంతవరకు దారితీస్తుందో తెలియదు కానీ.. ఇప్పటివరకైతే సమస్త రంగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. కృత్రిమ మేధ వల్ల ఇప్పటికే చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇంకా కోల్పోతూనే ఉన్నారు. అయితే భవిష్యత్ కాలంలో కృత్రిమ మేధ వల్ల మరిన్ని ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్థిక మాంధ్యం కంటే దారుణమైన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

" 2008లో ఏర్పడిన సంక్షోభం అనేక రకాల మార్పులకు కారణమైంది. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఆర్థికంగా కుప్ప కూలిపోయాయి. అయితే ఇప్పుడు అంతకుమించిన దారుణమైన పరిస్థితులు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.. ఇటీవల విడుదలైన ఒక ఆర్థిక సర్వేను నిపుణులు ఉటంకిస్తున్నారు. " 2008లో ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిపోయింది. అప్పుడు చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. ప్రపంచ దేశాలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇప్పుడు అంతకుమించిన దారుణమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం కల్పిస్తోంది. దీనికి తక్కువ సమయం మాత్రమే ఉంది. ఒకవేళ అదే గనుక జరిగితే కంప్యూటర్ ఆధారిత పరిశ్రమల మీద తీవ్రమైన ప్రభావం పడుతుంది. మనదేశంలోని ఐటిరంగం, వైట్ కాలర్ ఉద్యోగాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెద్దముప్పుగా పరిణమిస్తుంది. మనదేశంలో ఐటీరంగంలో వృద్ధి కనిపిస్తోంది. దానికి తగ్గట్టుగా కొత్త ఉద్యోగాలు రావడం లేదని" ఆర్థిక సర్వే వెల్లడించింది.

# సమ్మక్కకు సాంప్రదాయ స్వాగతం

**ముద్ర, మేడారం :**

సమ్మక్క రాక సందర్భంగా భక్తులు అపూర్వ భక్తి భావంతో స్వాగతం పలికారు. వివిధ కళారూపాల వేషధారణలు ధరించి నృత్యాలు చేస్తూ, రంగురంగుల ముగ్గులతో రహదారులను అలంకరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. గ్రామీణ సాంప్రదాయాలు, జానపద కళలు ప్రతిఫలించేలా నిర్వహించిన ఈ స్వాగతం అక్కడి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల హర్షధ్వానాలు, డప్పుల మోగింపులతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక ఉత్సాహంతో మార్మోగింది.







# కేసీఆర్.. సిట్ ముందు నిజాలు చెప్పాలి

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**ఫోన్ ట్యాపింగ్ పై కవితే బాధపడుతోంది**



**ముద్ర, వేములవాడ:**
ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో విచారణకు హాజరవుతున్న మాజీ సీఎం కేసీఆర్.. సిట్ ముందు నిజాలు మాత్రమే చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేసీఆర్ వయసు ఆధారంగా ఆయనకు సిట్ అధికారులు గౌరవం ఇస్తారని చెప్పారు. కేసీఆర్ కూడా చట్టానికి సహకరించాల్సిందేనని స్పష్టం చేశారు. సిట్ అధికారులు కేసీఆర్ కు నోటీసులు ఇవ్వ డాన్ని తప్పుబడుతోన్నబీఆర్ఎస్ నేతలపై ఆయన ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం వేములవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ తో తన రాజకీయ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టారన్నారు. ఆయనకు నోటీసులు ఇచ్చే అధికారం సిట్‌కు ఉందన్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే హరీష్ రావు, బీఆర్ఎస్ నాయకులు అందరూ ఎందుకు గగ్గోలు పెడుతున్నారో తెలియడం లేదన్నారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లుగా హరీష్ రావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రాష్ట్ర ఆత్మగౌరవం తెలంగాణ అమరవీరుల త్యాగాల్లో ఉంటుందన్నారు. ఈ విషయాన్ని హరీష్‌రావు తెలుసుకోవాలని సూచించారు. గతంలో అనేక మంది సీఎంలు, మాజీ సీఎంలు విచారణలకు హాజరయ్యారన్నారు. కానీ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వగానే ఏదో జరిగిపోతుందని హడావుడి చేస్తున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు.

# ఎన్డీఏదే గెలుపు

**మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే**

**ఎన్డీఏకు 352 సీట్లు, ఇండియా కూటమికి 182 స్థానాలు**

**ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీదే అధికారం..**

**ముద్ర న్యూస్ :**
కేంద్రంలో ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ కొనసాగుతున్నారు. ఎన్డీఏ కూటమిలో టిడిపి, నితీష్ కుమార్ పార్టీలు కీలకంగా ఉన్నాయి. వాస్తవానికి రెండు పర్యాయాలు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది. మొ దటిసారి భాగస్వామ్య పార్టీలతో అధికారాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రెండోసారి సింగల్ మెజారిటీతోనే అధికారంలోకి వచ్చింది. మూడోసారి మాత్రం కాంగ్రెస్ పార్టీకి అధికంగా సీటు రావడంతో టీడీపీ, నితీష్ కుమార్ పార్టీ సపోర్ట్ అవసరం ఏర్పడింది.
కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ బిజెపికి కొన్ని రాష్ట్రాలలో కేక్ వాక్ లాంటి ఫలితాలు వస్తున్నాయి. జమ్ము కాశ్మీర్ లాంటి రా ష్ట్రంలో మాత్రం ఇప్పటికీ అధికారం దక్కడం లేదు. హర్యానా, మహా రాష్ట్ర, ఢిల్లీ వంటి ప్రాంతాలలో అధికారాన్ని దక్కించుకొని బిజెపి కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చింది. ఇటీవల బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ బిజెపి, నితీష్ కుమార్ పార్టీలు అధికారాన్ని దక్కించుకున్నాయి. తద్వారా మెజారిటీ రాష్ట్రాలలో బిజెపి, దాని అనుకూల పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, పరిపాలన సాగిస్తున్నాయి.
దేశంలో మెజారిటీ స్థానాల్లో ఉన్నప్పటికీ.. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎవరు అధికారంలోకి వస్తారు? ఎన్డీఏ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి? అనే అంశం మీద ప్రఖ్యాత ఇండియా టుడే ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కాంగ్రెస్ పార్టీకి షాక్ లాంటి ఫలితాలు వచ్చాయి. ఎన్డీఏ కూటమికి ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే దేశంలో 352 స్థానాలు వస్తాయని ఇండియాటుడే అంచనా వేసిం ది. ఇండియా



కూటమి 182 స్థానాల్లో విజయం సాధిస్తుందని పేర్కొంది. బిజెపికి 41 శాతం అంటే దాదాపు 287 సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీకి 20% అంటే దాదాపు 80 సీట్లు వస్తాయని.. మిగతా పార్టీలకు 39 శాతం ఓట్లు, సీట్లు లభిస్తాయని ఇం డియా టుడే అంచనా వేసింది.
మనదేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఎన్డీఏ కూటమిలో ఎటువంటి లుకలుకలు కనిపించడం లేదు. నరేంద్ర మోడీకి కేంద్రంలో తిరుగులేదు. చంద్రబాబు, నితీష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా నడుచుకుంటున్నారు. బీహార్ లో నితీష్ కుమార్ కు బిజెపి సపోర్ట్ చేస్తుంది. బిజెపి సపోర్ట్ ద్వారానే ఆయన అక్కడ అధికారంలోకి వచ్చారు. అక్కడ ముఖ్యమంత్రిగా ఆయన కొ నసాగాలంటే కచ్చితంగా కేంద్రంలో బిజెపికి సపోర్ట్ చేయాల్సిన పరిస్థితి. ఇక ఏపీలో కూడా జనసేన, టిడిపి, బిజెపి భాగస్వామ్య పక్షాలు గా పరిపాలన సాగిస్తున్నాయి. చంద్రబాబుకు అన్ని విధాలుగా అటు పవన్ కళ్యాణ్, ఇటు బిజెపి నేతలు సహకారాలు అందిస్తున్నారు. ఈ ప్రకారం కేంద్రంలో ఇప్పటికిప్పుడు నాయక త్వం మార్పు గాని.. ఎన్ని కలు గాని జరిగే అవకాశం లేదు. కాకపోతే జనాల మూడ్ తెలుసుకోవ డం కోసం అప్పుడప్పుడు ఇండియా టుడే లాంటి సంస్థలు సర్వే నిర్వహిస్తుంటాయి .. ఈ సర్వే కూడా అలాంటిదే. 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఇండియా టుడే ఇటువంటి సర్వేనే నిర్వహించింది. అప్పుడు కూడా బిజెపికి భారీగా సీట్లు వస్తాయని తేలింది. ఇండియా టుడే అంచనా వేసిన విధంగా సీట్లు రాకపోయినప్పటికీ.. భాగస్వామ్య పక్షాలతో మాత్రం బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది.

# డేంజర్‌లో మేడిగడ్డ

**అత్యంత ప్రమాదకర స్థితిలో బ్యారేజ్**

**పార్లమెంట్ లో వెల్లడించిన కేంద్రం**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
దేశంలోని డ్యాంల భద్రత, పాత డ్యాంల ప్ర స్తుత పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం పార్లమెం ట్‌లో కీలక ప్రకటన చేసింది. తెలంగాణలోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్‌ను అత్యంత ప్రమాదకరమైన 'క్యాటగిరి–1' కింద వర్గీకరించినట్లు కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. లోక్‌సభలో టీడీపీ ఎంపీలు జి. లక్ష్మీనారాయణ, డాక్టర్ బైరెడ్డి శబరిలు అడిగిన ప్రశ్నలకు జలశక్తి శాఖ సహాయ మంత్రి లి ఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2025 వర్షాకాలం అనంతరం నిర్వహించిన తనిఖీల ఆధారంగా దేశవ్యాప్తంగా మూడు డ్యాంలు తీవ్రమైన భద్రతా లోపాలతో ఉన్నట్లు గుర్తించినట్లు కేంద్రం తెలిపింది. అందులో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారే జ్ ఒకటిగా పేర్కొంది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సేకరించిన సమాచా రం ప్రకారం.. దేశంలో 50 ఏళ్లు పైబడిన పాత డ్యాంల సంఖ్య 1,681గా ఉన్నట్లు వెల్లడించింది.
డ్యాం సేఫ్టీ చట్టం–2021 నిబంధనల మేరకు ప్రతి డ్యాం యజమాని వర్షాకాలానికి ముందు, తర్వాత తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 2025లో వర్షాకాలానికి ముందు 6,524 డ్యాంలను, వర్షాకాలం తర్వాత 6,553 డ్యాంలను అధికారులు పరిశీలించారు. ఈ తనిఖీల ఆధారంగా డ్యాంలను మరమ్మతు ల అత్యవసరతను బట్టి మూడు విభాగాలుగా వర్గీకరించారు. ఇందులో 'క్యాటగిరి–1' అంటే అత్యంత తీవ్రమైన లోపాలు ఉం డి, తక్షణ చర్యలు తీసుకోకపోతే డ్యాం విఫలమయ్యే ప్రమాదం ఉన్నట్లు అర్థం.

**ప్రమాదకర స్థితిలో మేడిగడ్డ..**
మేడిగడ్డతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరీ డ్యాం, జార్ఖండ్‌లోని బొకారో బ్యారేజ్‌లను కూడా ఈ ప్రమాదకర విభా గంలో చేర్చారు. లోయర్ ఖజూరీ, బొకారో బ్యారేజ్‌లను 'డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్' (డ్రిప్) ఫేజ్–2 కింద పునరుద్ధరణకు ఎంపిక చేసినట్లు కేంద్రం తెలిపింది. అయితే మేడిగడ్డ బ్యారే జ్ విషయంలో, దాని నిర్మాణ సమగ్రతను కాపాడేందుకు NDSA సూచించిన నివా రణ, ఉపశమన చర్యలను అమలు చేయా లని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి వివరించారు.
ప్రస్తుతం 19 రాష్ట్రాల్లోని 736 డ్యాంల పునరుద్ధరణ కోసం 10,211 కోట్ల రూపాయల అంచనాతో డ్రిప్ ఫేజ్–II, III పథకాలను కేంద్రం అమలు చేస్తోంది. డిసెంబర్ 31, 2025 నాటికి ఈ పథకాల కింద 2,029 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపిం ది. డ్రిప్ ఫేజ్–II కింద తెలంగాణకు 100 కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు బడ్జెట్ వివరాల్లో పేర్కొన్నారు. పాత డ్యాంల భద్రతను పర్యవేక్షిస్తూ, ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నట్లు మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి స్పష్టం చేశారు.

# మా బాస్ కేసీఆర్

**ఎంపీ ఈటల ఆసక్తికర వ్యాఖ్యలు**

**యథాలాపమా? ఉద్దేశపూర్వకమా?**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను 'మా బాస్' అంటూ వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మల్కాజిగిరి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈటల మాటలతో సభలో ఒక్కసారిగా 'జై కేసీఆర్', 'జై బీఆర్ఎస్' నినాదాలు మిన్నంటాయి. సభలో మాట్లాడిన ఈటల రాజేందర్.. ప్రజలే తన బలం అని, తనతో ఉంటే లాభమే తప్ప నష్టం ఉండదన్నారు. తన కు కులం, మతం లేదని స్పష్టం చేస్తూ.. తల్లిదండ్రులు తనకు పదవి ఇవ్వలేదని, ప్రజలే తనను ఆదరించి ఈ స్థాయికి తీసుకొచ్చారని పేర్కొ న్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ క్రమంలో మాట్లాడుతూనే.. "రాజశేఖర్ రెడ్డి బాస్.. అదే మా బాస్ కేసీఆర్" అంటూ వ్యాఖ్యానించడంతో సభలో హడావుడి నెలకొంది. వెంటనే జై కేసీఆర్ నినాదాలు వినిపించాయి. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో బీఆ ర్ఎస్ పార్టీలో కీలక నేతగా, మంత్రిగా కొనసాగిన ఈటల రాజేందర్.. అనంతరం మారిన రాజకీయ పరిణామాల్లో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ కూడా చేశారు. అలాంటి నేపథ్యంలో ఆయన నోట 'మా బాస్ కేసీఆర్' అనే మాట రావడం ఆసక్తికరంగా మా రింది. ఈటల వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ఆయన మళ్లీ బీఆర్ఎస్‌లో చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఎంతో ఆచితూచి మాట్లాడే నే తగా పేరున్న ఈటల ఈ మాటలు యథాలాపంగా అన్నారా? లేక భవిష్యత్తు రాజకీయాలకు సంకేతమా? అనే చర్చ కొనసాగుతోంది. దీనిపై స్పష్టత రావాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.



**కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి :**
**ఎంపీ ఈటల రాజేందర్**

**ముద్ర, హైదరాబాద్ :**
ప్రస్తుతం రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధికి వెచ్చిస్తోన్న ప్రతి రూపాయి కేంద్రం పంపించిందేనని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దివాళా తీసింది, నన్ను కోసినా ఒక్క రూపాయి లేదు అని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పిన వ్యాఖ్యలను ఈటల ఈ సందర్భంగా గుర్తు చేశారు. అభివృద్ధికి నిధులే లేకపోతే మున్సిపల్ ఎన్నికల్లో మీ పార్టీని గెలిపించినా ఏం లాభమని ఎద్దేవా చే శారు. గురువారం అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ఈటల.. కాంగ్రెస్ పాలనపై విమర్శల వర్షం కురిపించారు. రెండున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా పెన్ష న్లు మంజూరు చేయలేదనీ, పాత పెన్షన్లు పెంచలేదన్నారు. నిరుద్యోగభృతి ఇస్తానన్న మాజీ సీఎం కేసీఆర్.. సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. ప్రజల దీవెనలతో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము గెలిచాం తప్ప అభివృద్ధికి ఒక్క రూపాయి తమ చేతిలో లేదంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే స్మార్ట్ సిటీల పేరుతో డబ్బులు తీసుకువస్తామని చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్ లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్లన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయన్నారు. రైల్వే స్టేషన్ లో ఆధునీకరణ మోడీ తోనే సాధ్యమైందన్నారు.

# లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం మహాపచారం

**సిట్ నివేదికతో జగన్ ప్రభుత్వ వైఫల్యం బట్టబయలు**

**ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్**

**ముద్ర, మంగళగిరి:**
తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్టు సుప్రీం కోర్టు నియమించిన సిట్ నివేదిక స్పష్టం చేయడంతో మాజీ సీఎం జగన్‌రెడ్డి పని గోవింద అయిందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2019–24 మధ్య కాలంలో తిరుమల లడ్డు ప్రసాదం తయారీలో చుక్క పాలు లేకుండా, పామ్ ఆయిల్‌కు రసాయనాలు కలిపి తయారు చేసిన నెయ్యిని వినియోగించారని సిట్ తేల్చిందన్నారు. ఈ కల్తీ నెయ్యిని సరఫరా చేసిన భోళే బాబా డైరీ, ఏఆర్ డైరీ, వైష్ణవి డైరీ తదితర సంస్థలు నకిలీ కంపెనీలేనని, దీనికి సంబంధించిన పలువురిని అరెస్టు చేసి, మరికొందరిని చార్జిషీట్‌లో చేర్చినట్లు తెలిపారు. సుమారు 60లక్షల లీటర్ల కల్తీ నెయ్యితో దాదాపు 22కోట్ల లడ్డులు తయారైనట్లు సిట్ నివేదిక వెల్లడించిందన్నారు. ఇంత జరుగుతున్నా దేవస్థానం అధికారులు, బోర్డు సభ్యులు, అప్పటి పాలకులు తెలిసీ నిశ్శబ్దంగా ఉండటం క్షమించరాని నేరమని ఆయన ఆరోపించారు. 2022లోనే కల్తీపై నివేదికలు వచ్చినా చర్యలు తీసుకోలేదని, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. దేవుడి ప్రసాదంలో కల్తీ జరగడం మహాపచారమని, దీనికి బాధ్యులైన వారందరూ ప్రజలకు, దేవుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి రాష్ట్ర ప్రజలందరినీ చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నానని అన్నారు.

# తెలంగాణ విద్యా ముఖచిత్రాన్ని మారుద్దాం..

**హార్వర్డ్ వేదికగా యువతకు సీఎం రేవంత్ పిలుపు**



**ముద్ర న్యూస్ :**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్బీఎస్) విద్యార్థులతో జరిపిన భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లోని భారతీయ విద్యార్థుల బృందం ఆహ్వానం మేరకు ఆయన వారిని కలిశారు. తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా విద్యార్థులతో గడిపిన సీఎం, వారి కెరీర్ లక్ష్యాలు, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో వారు సాధిస్తున్న విజయాలు రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు.

**అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్న సీఎం..**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వేదికపై తన వ్యక్తిగత విజయ మంత్రాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. పట్టుదల, దూరదృష్టి, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన ఉద్ఘాటించారు. కేవలం విద్యాపరమైన విజయాలకే పరిమితం కాకుండా, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు అడిగిన పలు సాంకేతిక, వృత్తిపరమైన ప్రశ్నలకు ఆయన ఓపిగ్గా సమాధానమిస్తూ వారిలో స్ఫూర్తిని నింపారు.

**రైజింగ్ తెలంగాణ విజన్ ప్రస్తావన..**
తెలంగాణను ప్రపంచ పటంలో అగ్రగామిగా నిలిపేందుకు రూపొందించిన 'రైజింగ్ తెలంగాణ' విజన్‌ను సీఎం ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఐటీ, ఫార్మా రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని ఆయన ప్రస్తావించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, అంతర్జాతీయ పెట్టుబడులకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని స్పష్టం చేశారు.

**స్కిల్ డెవలప్మెంట్ తో ఉపాధి అవకాశాలు..**
రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయడమే తన ప్రభుత్వ ప్రాధాన్యతని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆధునిక కాలానికి అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్ మెంట్), నాణ్యమైన విద్యను అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. హార్వర్డ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో చదువుతున్న విద్యార్థులు తమ మేధస్సును, పరిశోధనా ఫలితాలను తెలంగాణలోని విద్యా ప్రమాణాలను పెంచడానికి ఉపయోగించవచ్చో చర్చించారు

**తెలంగాణ రాష్ట్ర 'బ్రాండ్ అంబాసిడర్లు'గా హార్వర్డ్ విద్యార్థులు..**
చివరగా, హార్వర్డ్ విద్యార్థులందరినీ తెలంగాణ రాష్ట్ర 'బ్రాండ్ అంబాసిడర్లు'గా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కోరారు. విదేశాల్లో ఉన్న తమ నెట్‌వర్క్‌లను ఉపయోగించి భారతదేశం, తెలంగాణ యొక్క వృద్ధి కథలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయాలని, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరుతూ విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు.

# ఈయూతో ఒప్పందం చారిత్రాత్మకం

**ప్రపంచానికి భారత్ ఆశాకిరణం**
**'వికసిత్ భారత్' లక్ష్యం**
**భారత్ వైపు అన్ని దేశాల చూపు**
**సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదు**
**ప్రధాని నరేంద్ర మోదీ**

**ముద్ర, న్యూఢిల్లీ :**
కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా టెక్నాలజీ మనుషులకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేస్తూ, అది మనుషుల సామర్థ్యాన్ని పెంచే సాధనం మాత్రమేనని తెలిపారు. ఈసందర్భంగా ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఆయన శుభసూచికగా అభివర్ణించారు. ఈ ఒప్పందం ద్వారా భారత తయారీ రంగానికి కొత్త మార్కెట్ అవకాశాలు తెరుచుకుంటాయని, దేశీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని చెప్పారు. యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాలకు నాణ్యమైన భారత ఉత్పత్తులను అందించాలని తయారీదారులను కోరారు.

**- 'వికసిత్ భారత్' లక్ష్యం..**
బడ్జెట్ దిశగా దేశం "రిఫార్మ్–పెర్ఫామ్–ట్రాన్స్‌ఫామ్" సూత్రంతో ముందుకు సాగుతోందని మోదీ తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారాలు లభిస్తున్నాయన్నారు. భారత్ ప్రస్తుతం "రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్"లో వేగంగా ప్రయాణిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌ను ఒక స్థిరమైన, అభివృద్ధి పథంలో ఉన్న దేశంగా చూస్తున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని, ప్రపంచానికి భారత్ ఒక ఆశాకిరణంగా నిలుస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో పార్లమెంట్ సభ్యులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో భారత్ పురోగతి సాధిస్తున్న నేపథ్యంలో టెక్నాలజీని స్వీకరించాల్సిందే కానీ అది మనుషుల స్థానాన్ని భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. మొత్తంగా, సాంకేతిక అభివృద్ధి మనిషికి సహాయకారి మాత్రమే గానీ ప్రత్యామ్నాయం కాదన్న సందేశాన్ని ప్రధాని మోదీ స్పష్టంగా తెలియజేశారు.



# తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

**ముద్ర, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా:**
జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డి గురువారం జిల్లేడు చౌదరిగూడ తహశీల్దార్ కా ర్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లేడు చౌదరిగూడ మండలానికి సంబంధించిన భూభారతి పెండెన్సీ క్లియర్ చేయమని, మీసేవ ఎస్ఎల్ఏ గడువు దాటిన పెండింగ్ కేసులు, ఎఫ్ లైన్ పిటిషన్లు క్లియర్ చేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ భూములను రక్షించాలని, ప్రజల అవసరాలను తీర్చడానికి సిబ్బంది అందుబాటులో ఉండాలని, సిబ్బందికి కేటాయించిన పనులను స కాలంలో పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో జీపీఎస్‌లు చాలా తీవ్రంగా వ్యవహరించాలని, పెండెన్సీ లే కుండా క్లియర్ చేయాలని తహసిల్దారుకు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మేడారం జాతర విశేషాలు**

నాలుగు రోజుల ఉత్సవం: సారలమ్మ గద్దెకు రావడం, సమ్మక్క రాక, మొక్కుల చెల్లింపు, చివరగా అమ్మవార్ల వనప్రవేశంతో ఈ ఉత్సవం నాలుగు రోజుల పాటు సాగుతుంది.






# మైండ్‌సెట్ మార్చుకున్నాకే మారిన ఆట: శివమ్ దూబే

**ముద్ర, స్పోర్ట్స్**

తన ఆటలో వచ్చిన మార్పుకు బలమైన మానసిక స్థితియే కారణమని టీమిండియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే స్పష్టం చేశాడు. బౌలర్లు అమలు చేసే వ్యూహాలను ముందుగానే అర్థం చేసుకోగలగడం వల్లే దూకుడుగా షాట్లు ఆడగలుగుతున్నానని వెల్లడించాడు.

న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా వైజాగ్ వేదికగా జరిగిన నాలుగో మ్యాచ్‌లో దూబే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. 23 బంతుల్లో 65 పరుగులు సాధించిన అతడు మూడు ఫోర్లు, ఏడు సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించాడు. భారత్ ఓడిపోయినా, దూబే బ్యాటింగ్ మాత్రం అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇష్ సోధీ బౌలింగ్‌ను లక్ష్యంగా చేసుకున్న దూబే, ఒకే ఓవర్‌లో 29 పరుగులు రాబట్టాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి మ్యాచ్‌పై ఆశలు రేపాడు. క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చినా భయపడకుండా ఆడటం తనకు అలవాటైందని మ్యాచ్ అనంతరం చెప్పాడు. అలాంటి సందర్భాల్లో బౌలర్లు ఏ బంతి వేయబోతున్నారో అంచనా వేసే సామర్థ్యం పెరిగిందని వివరించాడు.

63 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన వేళ బ్యాటింగ్‌కు వచ్చిన దూబే, తొలి బంతినే భారీ సిక్సర్‌గా మలిచాడు. ఆ షాట్ దాదాపు 101 మీటర్ల దూరం వెళ్లడంతో మిచెల్ సాంట్నర్ సహా న్యూజిలాండ్ ఆటగాళ్లు ఆశ్చర్యపోయారు. ఇష్ సోధీ వేసిన ఓవర్‌లో వరుస బౌండరీలతో మ్యాచ్‌ను తనవైపు తిప్పే ప్రయత్నం చేశాడు. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న దూబే దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. బంతి బౌలర్ చేతికి తాకి నాన్‌స్ట్రైకర్ వికెట్లను తాకడంతో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. ఇంకొద్దిసేపు క్రీజులో నిలిచి వుంటే మ్యాచ్ ఫలితం మారేదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# మహేష్ బాబు ఫ్యాన్ అభిషేక్ శర్మ.. మైదానంలో విధ్వంసం

**ముద్ర, స్పోర్ట్స్**

టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు అంటే ప్రత్యేక అభిమానం. ఖాళీ సమయాల్లో మహేష్ సినిమాలు చూడటం అలవాటుగా చెప్పాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడే సమయంలో తెలుగు సినిమాలపై సహచరులతో తరచూ చర్చలు సాగిస్తానని వెల్లడించాడు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప సినిమా తనను బాగా ప్రభావితం చేసిందని, అందులోని ఆయన మేనరిజమ్ నచ్చిందని పేర్కొన్నాడు.

మైదానంలోనూ అభిషేక్ శర్మ అదే స్థాయిలో ఆకట్టుకుంటున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో దూకుడైన బ్యాటింగ్‌తో వార్తల్లో నిలిచాడు. తొలి మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన అభిషేక్, రెండో మ్యాచ్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. మూడో టీ20లో మాత్రం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించి మ్యాచ్‌ను 10 ఓవర్లలోనే ముగించాడు. నాలుగో టీ20లో మరోసారి డక్‌గా ఔటవ్వడంతో భారత్‌కు పరాజయం ఎదురైంది.

ప్రస్తుతం ప్రత్యర్థి బౌలర్లకు సవాల్‌గా మారిన అభిషేక్ శర్మ.. టీమిండియాకు కీలక ఆటగాడిగా ఎదుగుతున్నాడు. అతడిని ఔట్ చేయగలిగితేనే గెలుపు సాధ్యమన్న స్థాయికి అతడి ప్రభావం పెరిగింది. ఒకప్పుడు విరాట్ కోహ్లీకి ఉన్న ఈ స్టార్ డమ్‌ను, ఇప్పుడు అభిషేక్ శర్మ అందుకునే దిశగా దూసుకెళ్తున్నాడన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## వింతలు విశేషాలు+ జాతీయం



# ధర్మశాల స్టేడియం ఇలా మారిపోయింది ఏంటి..

**ముద్ర, స్పోర్ట్స్**

మనదేశంలో క్రికెట్ స్టేడియాలు చాలా ఉన్నాయి. ఈ స్టేడియాలలో అంతర్జాతీయ నుంచి మొదలుపెడితే జాతీయం వరకు మ్యాచులు జరుగుతూనే ఉంటాయి. మన దేశంలో చాలా స్టేడియాలు ఉన్నప్పటికీ కొన్ని మాత్రం ఐకానిక్ గా పేరు తెచ్చుకున్నాయి. అందులో ప్రధానమైనది ధర్మశాల స్టేడియం.

ధర్మశాల స్టేడియం హిమాచల్ ప్రదేశ్ లో ఉంది. హిమాచల్ ప్రదేశ్ హిమాలయాలకు దగ్గరలో ఉంటుంది. అందువల్లే ఇక్కడ వాతావరణం ఎప్పటికీ చల్లగా ఉంటుంది. పైగా ధర్మశాల స్టేడియం కూడా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా ఉంటుంది. దీంతో ఇక్కడ ఆడేందుకు ప్లేయర్లు విపరీతమైన ఆసక్తిని చూపిస్తుంటారు. పైగా ఇక్కడి వాతావరణం కూడా అత్యంత అద్భుతంగా ఉంటుంది. అందువల్లే ఇక్కడ ఆడేందుకు ప్లేయర్లు అమితమైన ఆసక్తిని ప్రదర్శిస్తుంటారు.

హిమాచల్ ప్రదేశ్లో ప్రస్తుతం విపరీతమైన చలి ఉంది. అక్కడ స్వల్ప స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో మంచు విపరీతంగా కురుస్తోంది. ఈ క్రమంలోనే ధర్మశాల స్టేడియం మంచు కొండ మాదిరిగా మెరిసిపోతోంది. ధర్మశాల స్టేడియం చుట్టూ ధవలాదర్ పర్వత శ్రేణులు ఉన్నాయి. ఆ పర్వతాల మీద మంచు దుప్పటి మాదిరిగా పరచుకొని ఉంది. శీతల గాలులు వీస్తూ ఉండడంతో అక్కడి వాతావరణం మొత్తం ఒక్కసారిగా అంటార్కిటిక మాదిరిగా మారిపోయింది. ధర్మశాల స్టేడియం పూర్తిగా మంచుతో నిండిపోవడంతో దానికి సంబంధించిన ఫోటోలు విస్తృతంగా సామాజిక మాధ్యమాలలో దర్శనమిస్తున్నాయి.

వాస్తవానికి ఇలాంటి సన్నివేశాలు శీతల ప్రాంతాలకు దగ్గరగా ఉన్న స్టేడియాలలో కనిపిస్తాయి. అయితే ధర్మశాల స్టేడియం మంచుతో కనిపిస్తుండడంతో సరికొత్తగా దర్శనమిస్తోంది. దట్టంగా పరుచుకున్న మంచు.. ఆకాశాన్ని తాకే విధంగా కొండలు.. పచ్చని కోక కట్టినట్టుగా ఉన్న చెట్లు.. ధర్మశాల స్టేడియానికి సరికొత్త రూపం తీసుకొస్తున్నాయి. ఈ ఫోటోలను చూసిన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధర్మశాల స్టేడియం వెండి మాదిరిగా మెరిసిపోతుందని వ్యాఖ్యానిస్తున్నారు. గత ఏడాది జరిగిన ఐపీఎల్లో ధర్మశాల స్టేడియంలో మ్యాచ్ ను ఐపీఎల్ నిర్వాహకులు అర్ధాంతరంగా వాయిదా వేశారు. అప్పట్లో ఆపరేషన్ సిందూర్ జరుగుతున్న నేపథ్యంలో ఆ నిర్ణయం తీసుకున్నారు. స్టేడియంలో ముందుగా లైట్లను నిలుపుదల చేశారు. ఆ తర్వాత ప్రేక్షకులను విడతలవారీగా మైదానం నుంచి బయటికి పంపించారు.






# బంగ్లాదేశ్‌కు బుద్ధొచ్చింది.. భారత్ పర్యటనకు గ్రీన్ సిగ్నల్

**ముద్ర, స్పోర్ట్స్**

భారత్‌తో అనవసరంగా తలపడితే నష్టమేనన్న విషయం బంగ్లాదేశ్ ప్రభుత్వానికి ఇప్పుడు అర్థమైనట్టుంది. పాకిస్థాన్ వైఖరిని అనుసరించి భారత్‌పై ప్రతికూల ధోరణి అవలంబించిన బంగ్లాదేశ్.. తాజాగా యూటర్న్ తీసుకుంది. భారత్‌లో తమ ఆటగాళ్లకు భద్రత లేదంటూ టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్.. ఇప్పుడు అదే భారత్‌కు తమ షూటింగ్ జట్టును పంపేందుకు అనుమతి ఇచ్చింది.

ఫిబ్రవరి 2 నుంచి న్యూఢిల్లీ వేదికగా ప్రారంభమయ్యే ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇద్దరు సభ్యులతో కూడిన బంగ్లాదేశ్ షూటింగ్ బృందానికి ఆ దేశ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

**నేపథ్యం ఇదే**

భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకున్న విషయం తెలిసిందే. భారత్‌లో భద్రతా సమస్యలున్నాయంటూ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కోరగా, ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో పూర్తి భద్రత ఉందని స్పష్టం చేసింది. దీంతో బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలగగా, ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించారు.

క్రికెట్ విషయంలో కఠిన వైఖరి చూపిన బంగ్లాదేశ్.. ఇతర క్రీడల్లో మాత్రం భారత్‌కు రావడానికి అంగీకరించడం రాజకీయంగా, క్రీడాపరంగా భిన్న సంకేతాలు ఇస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో రాజకీయ ఉద్రిక్తతలు

- **స్విటోలినా–సబలెంకా మ్యాచ్‌లో హై టెన్షన్**



ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సెమీఫైనల్ మ్యాచ్‌లో క్రీడా స్ఫూర్తికన్నా రాజకీయ ఉద్రిక్తతలే ఎక్కువగా కనిపించాయి. ఉక్రెయిన్ ఆటగాళ్ల ప్రతినిధి ఎలినా స్విటోలినా, బెలారస్ స్టార్ అరీనా సబలెంకా మధ్య జరిగిన పోరు టెన్నిస్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా మ్యాచ్‌కు ముందు, అనంతరం నెట్ వద్ద ఆటగాళ్లు పరస్పరం చేతులు కలపడం ఆనవాయితీ. అయితే ఈ మ్యాచ్‌లో ఆ సంప్రదాయం పూర్తిగా కనిపించలేదు.

**ఫొటోలకు నో.. హ్యాండ్‌షేక్‌కు దూరం**

మ్యాచ్ ప్రారంభానికి ముందు అధికారిక ఫొటోలకు వరల్డ్ నంబర్ వన్ అరీనా సబలెంకా సిద్ధంగా నిలిచినా, స్విటోలినా ఆమెతో కలిసి ఫొటో దిగేందుకు నిరాకరించింది. అనంతరం నెట్ వద్ద ఎదురైనప్పటికీ ఇద్దరూ పరస్పరం కళ్లలోకి చూసుకోకపోవడం, చేతులు కలపకపోవడం గమనార్హం. 2022లో ప్రారంభమైన రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ ఆటగాళ్లతో హ్యాండ్‌షేక్ ఇవ్వబోమని ఉక్రెయిన్ క్రీడాకారులు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగానే స్విటోలినా ఇలా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

**ఈ నిర్ణయానికి కారణం ఇదే**

రష్యాకు బెలారస్ మద్దతు ఇస్తున్న పరిస్థితుల్లో, ఆ దేశానికి చెందిన క్రీడాకారులతో స్నేహపూర్వక సంకేతాలు ఇవ్వడం తమ దేశ ప్రజల పట్ల అవమానంగా భావిస్తామని స్విటోలినా ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. ఈ చర్య ద్వారా ఉక్రెయిన్‌కు మద్దతుగా ఒక స్పష్టమైన సందేశం ఇవ్వాలన్నదే తన ఉద్దేశమని ఆమె గతంలో వెల్లడించారు.

**మ్యాచ్ మధ్యలో వాగ్వివాదం**

ఉద్రిక్తతలు కేవలం హ్యాండ్‌షేక్ వరకే పరిమితం కాలేదు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనూ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక ర్యాలీ సందర్భంగా సబలెంకా గట్టిగా అరవడాన్ని అంపైర్ 'హిండ్రెన్స్'గా పరిగణించి పాయింట్‌ను స్విటోలినాకు ఇచ్చాడు. ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సబలెంకా వీడియో రివ్యూ కోరుతూ అంపైర్‌తో వాదనకు దిగింది. దీంతో మ్యాచ్ కొద్దిసేపు నిలిచిపోవడంతో మైదానంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ఫైనల్‌కు దూసుకెళ్లిన సబలెంకా**

ఇన్ని రాజకీయ ఉద్రిక్తతల మధ్యన కూడా అరీనా సబలెంకా తన ఆటపై పూర్తి దృష్టి పెట్టి ఘన విజయం సాధించింది. రాడ్ లేవర్ అరేనాలో జరిగిన ఈ హైవోల్టేజ్ పోరులో ఆమె 62, 63 తేడాతో స్విటోలినాను ఓడించి వరుసగా నాలుగోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకుంది. కేవలం గంట 16 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ విజయంతో ఓపెన్ ఎరాలో ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో వరుసగా నాలుగు సార్లు ఫైనల్‌కు చేరిన మూడో క్రీడాకారిణిగా సబలెంకా అరుదైన ఘనతను సాధించింది.

# భారత్‌పాక్ సూపర్ సిక్స్ ఫైట్

- **ఉత్కంఠ పోరులో గెలిచేదెవరో**

**ముద్ర, స్పోర్ట్స్**

అండర్19 ప్రపంచకప్ 2026లో యువ క్రికెటర్ల ఆసక్తి ఉగ్రస్థాయికి చేరింది. ఫిబ్రవరి 1న జింబాబ్వే, బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో భారత్‌పాకిస్థాన్ మధ్య సూపర్‌సిక్స్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత అధికారికంగా సెమీస్‌కు చేరతాడు.

భారత్ జట్టు, ఆయుష్ మాత్రే సారథ్యంలో, వరుసగా మూడు విజయాలతో సత్తా చాటుతోంది. పాక్ జట్టు మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచినప్పటికీ, భారత యువ కుర్రాళ్లు ఎమర్జింగ్ ఆసియా కప్ ఫైనల్‌లో పాక్ చేతిలో ఎదురైన పరాజయాన్ని ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతో మైదానానికి అడుగుపెడుతున్నారు. టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ, గత సిరీస్‌లో పాక్ పేసర్లను నిలబెట్టి ఆటగా ఆకట్టుకున్నాడు; ఈసారి బ్యాటింగ్‌తో అదే సమాధానం ఇవ్వడానికి రెడీ అయ్యాడు.

మ్యాచ్ భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమవుతుంది. టాస్ 12.30 గంటలకు పడనుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్ ఈ టోర్నీ అధికారిక ప్రసారదారులుగా ఉన్నారు. జియో హాట్‌స్టార్ ద్వారా ఫ్రీగా మ్యాచ్ చూడాలంటే, ప్రత్యేక మొబైల్ రిచార్జ్ ప్లాన్స్ ద్వారా సబ్‌స్క్రిప్షన్ పొందవచ్చు. ఈ అత్యధిక ఉత్కంఠభరిత మ్యాచ్‌ను అభిమానులు తప్పకుండా చూడవలసిన వేడుకగా ఎదురు చూస్తున్నారు.




# వరల్డ్‌కప్ బాయ్‌కాట్ బెదిరింపులు నాటకమే: అజింక్యా రహానే

**ముద్ర, స్పోర్ట్స్**



పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మా ప్రభుత్వం అనుమతిస్తేనే వరల్‌డ్‌కప్ ఆడుతామని పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలను భారత మాజీ క్రికెటర్ అజింక్యా రహానే కొట్టిపారేశాడు. వరల్‌డ్‌కప్‌ను బాయ్‌కాట్ చేసేంత దమ్ము, ధైర్యం పాకిస్థాన్‌కు లేదని స్పష్టం చేశాడు.

క్రిక్‌బజ్‌తో మాట్లాడిన రహానే, షెడ్యూల్ ఖరారైందని, ఒప్పందాల ప్రకారం పాకిస్థాన్ మ్యాచ్‌లన్నీ ఇప్పటికే శ్రీలంకలో నిర్ణయించబడ్డాయని గుర్తు చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో పాక్ జట్టు టోర్నీ నుంచి తప్పుకునే అవకాశమే లేదని వ్యాఖ్యానించాడు. అన్ని జట్లలాగే పాకిస్థాన్ కూడా వరల్‌డ్‌కప్ ఆడుతుందని చెప్పాడు.

ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికగా T20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. భద్రతా కారణాలతో ఇండియాలో ఆడబోమని బంగ్లాదేశ్ వెనక్కి తగ్గడంతో, ఐసీసీ గ్రూప్‌సీలో స్కాట్లాండ్‌కు చోటు కల్పించింది. ఈ పరిణామాల మధ్య మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపినా, ఆ మరుసటి రోజే పీసీబీ స్క్వాడ్‌ను ప్రకటించడం గమనార్హం. దీంతో పాకిస్థాన్ పాల్గొనడం దాదాపు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

శ్రీలంకలోనే పాక్ మ్యాచ్‌లు భారత్-పాకిస్థాన్ క్రికెట్ బోర్డుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఇరుజట్ల మ్యాచ్‌లు తటస్థ వేదికలపై జరుగుతున్నాయి. ఈ వరల్‌డ్‌కప్‌లో పాకిస్థాన్ అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనే నిర్వహించనున్నారు. డిసెంబర్ 2024లో పీసీబీ-బీసీసీఐ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు కొలంబో, పల్లెకెలె స్టేడియాల్లో పాక్ మ్యాచ్‌లు ఉంటాయి. గ్రూప్ ఏలో భారత్-పాకిస్థాన్ జనవరి 15న కొలంబోలో తలపడనున్నాయి. ఆసియా కప్ ఫైనల్ తర్వాత దాయాదుల మధ్య ఇదే తొలి పోరు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
30.01.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మేడారం జాతర విశేషాలు**

ములుగు జిల్లా వేదిక: దట్టమైన అడవుల మధ్య ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామం ఈ చారిత్రక జాతరకు వేదిక.



## ఎన్టీఆర్ పేరు వాడితే జైలుకే..

నటుడు జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించింది. అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, గుర్తింపు, ఇమేజ్‌ను వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుతున్నారని ఎన్టీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్టీఆర్ పేరు, "ఎన్‌టీఆర్", "జూనియర్ ఎన్‌టీఆర్", "తారక్" వంటి పేర్లు, "యంగ్ టైగర్", "మ్యాన్ ఆఫ్ మాసెస్" వంటి బిరుదులు, ఆయన ఫొటోలు, ఇమేజ్‌ను అనుమతి లేకుండా వాణిజ్యంగా వినియోగించడం చట్ట విరుద్ధం. ఎక్కడైనా ఇలా అనధికార వినియోగం జరిగితే వెంటనే తొలగించాలని కోర్టు స్పష్టం చేసింది.

**పూర్తి హక్కులు ఎన్టీఆర్‌కే**

నందమూరి తారక రామారావు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న సెలబ్రిటీ అని కోర్టు పేర్కొంది. ఆయన పేరు, రూపం ప్రజలకు ప్రత్యేక గుర్తింపుగా మారాయని, అందువల్ల వాటిపై హక్కులు ఆయనకే చెందుతాయని అభిప్రాయపడింది. వ్యక్తి పేరు, ఇమేజ్ వంటి వ్యక్తిత్వ హక్కులు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛతో అనుసంధానమై ఉంటాయని, ఇవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 కింద రక్షణ పొందుతాయని వివరించింది. కాపీరైట్ చట్టం 1957, ట్రేడ్‌మార్క్ చట్టం 1999 కింద కూడా ఈ హక్కులను అమలు చేయవచ్చని తెలిపింది.

ఇంటర్మీడియరీ ప్లాట్‌ఫామ్‌లైన ఫేస్‌బుక్, యూట్యూబ్‌లకు కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2021 ఐటీ రూల్స్ కింద ఈ పిటిషన్‌ను అధికారిక ఫిర్యాదుగా పరిగణించి, హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన లింక్‌లను చట్టపరంగా నిర్ణయించిన గడువుల్లో తొలగించాలని సూచించింది.

**AI కంటెంట్‌పైనా ఆంక్షలు**

ఎన్టీఆర్ పేరు, ఫొటో, ఇమేజ్, గుర్తింపును మెర్చండైజ్, డిజిటల్ కంటెంట్, మార్ఫ్ చేసిన చిత్రాలు, AI కంటెంట్ లేదా ఏదైనా టెక్నాలజీ ద్వారా వాణిజ్య ప్రయోజనాల కోసం వాడకూడదని కోర్టు స్పష్టం చేసింది. డిజిటల్ యుగంలో పబ్లిక్ పర్సనాలిటీల గుర్తింపు రక్షణ అత్యంత కీలకమని పేర్కొన్న కోర్టు, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.



## వెంకీ–త్రివిక్రమ్ వీడియో వైరల్...

వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' షూటింగ్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్ జెబిఎస్ ప్రసాద్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ వద్ద జరిగిన చిత్రీకరణలో వెంకటేష్ స్టైలిష్ లుక్ ఆకట్టుకుంటోంది. మేలోపు షూటింగ్ పూర్తి చేసి, సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి.



## దసరా రేస్‌లో 'పెద్ది'–'ఫౌజీ'

**టాలీవుడ్‌కు హై ఓల్టేజ్ పోటీ**

గత ఏడాది దసరా సీజన్ టాలీవుడ్‌కు భారీ వసూళ్లు అందించింది. పవన్ కళ్యాణ్ 'ఓజీ', 'కాంతారా 2' చిత్రాలు వారం రోజుల వ్యవధిలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించాయి. అదే తరహాలో ఈ దసరా సీజన్ కూడా ఆసక్తికరమైన పోటీకి వేదిక కాబోతోందన్న చర్చ మొదలైంది.

ప్రభాస్ ప్రస్తుతం ఫిబ్రవరి 2 నుంచి 'కల్కి 2' షూటింగ్‌లో పాల్గొననున్నాడు. పది రోజుల షెడ్యూల్ అనంతరం తన పూర్తి సమయాన్ని 'ఫౌజీ' చిత్రానికి కేటాయించనున్నట్టు సమాచారం. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పటికే 50 శాతం కంటే ఎక్కువ షూటింగ్ పూర్తి చేసుకుంది. మిగతా భాగాన్ని త్వరితగతిన పూర్తిచేసి, దసరా కానుకగా విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

ఈ సినిమా కోసం ప్రభాస్ తన మరో ప్రాజెక్ట్ 'స్పిరిట్' షూటింగ్‌కు తాత్కాలిక విరామం ఇచ్చినట్టు సమాచారం. అన్నీ అనుకున్నట్టుగా సాగితే 'ఫౌజీ' ఈ దసరాకు థియేటర్లలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మరోవైపు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' కూడా దసరా బరిలో నిలిచినట్టు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. తొలుత మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేయాలనుకున్న ఈ చిత్ర షూటింగ్ ఇంకా రెండు నెలలు పెండింగ్ ఉండటంతో ఆ ప్లాన్ వాయిదా పడింది. మే 1 విడుదల ఆలోచన కూడా విరమించుకుని, దసరా సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.

దర్శకుడు బుచ్చి బాబు ఈ సినిమాకు పోస్ట్ ప్రొడక్షన్‌పై ఎక్కువ సమయం కేటాయించాలనుకుంటుండటంతో, ప్రశాంతంగా దసరా సెలవుల్లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.




ఒకవైపు రామ్ చరణ్ 'పెద్ది', మరోవైపు ప్రభాస్ 'ఫౌజీ'... ఈ రెండు భారీ చిత్రాలు ఒకే సీజన్‌లో విడుదలైతే టాలీవుడ్‌కు మరోసారి పెద్ద టర్నోవర్ ఖాయమనే అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం 'పెద్ది'పై హైప్ ఎక్కువగా కనిపిస్తోంది. 'ఫౌజీ' నుంచి ఇప్పటివరకు ప్రమోషనల్ కంటెంట్ తక్కువగానే వచ్చినప్పటికీ, విడుదల సమయం దగ్గర పడేకొద్దీ అంచనాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే కమర్షియల్ అంశాలు ఎక్కువగా ఉన్న చిత్రంగా 'పెద్ది' దసరా రేస్‌లో పైచేయి సాధించే అవకాశం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.



## రిలిజ్ డేట్ తో షాకిచ్చిన రాజమౌళి

RRR వంటి గ్లోబల్ హిట్ తర్వాత రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ సినిమాలో సూపర్ స్టార్ మహేష్ బాబును ఇప్పటివరకు కనిపించని స్థాయిలో చూపించాలనే లక్ష్యంతో రాజమౌళి పని చేస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో మహేష్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో ఆయన శ్రీరాముడి రూపంలోనూ కనిపించనున్నట్లు సమాచారం. ఆ సన్నివేశాల షూటింగ్ గ్లోబెట్రాటర్ ఈవెంట్‌కు ముందే పూర్తయ్యిందని రాజమౌళి స్వయంగా వెల్లడించాడు. తన మొబైల్ వాల్‌పేపర్‌గా కూడా మహేష్ శ్రీరాముడి లుక్ ఉన్న ఫొటోనే పెట్టుకున్నట్టు చెప్పాడు.

'వారణాసి' రాజమౌళి కెరీర్‌లోనే అత్యంత వేగంగా పూర్తయ్యే చిత్రంగా నిలవనుంది. ఈ ఏడాది అక్టోబర్‌లోపు టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. మహేష్ బాబు భాగానికి సంబంధించిన షూటింగ్ సెప్టెంబర్‌కే ముగిసే అవకాశాలు ఉన్నాయి. వీఎఫ్ఎక్స్ పనులు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి.

అన్ని అనుకున్నట్టే జరిగితే 2027 ఏప్రిల్ 7న సినిమాను విడుదల చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ తేదీని అధికారిక ప్రకటన లేకుండానే రాజమౌళి వినూతనంగా సూచించాడు. వారణాసి ప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు బ్యానర్లలో ఒకదానిపై 'In Theatres', మరొకదానిపై '7 April 2027' అని మాత్రమే ఉండటం చర్చనీయాంశమైంది. ఇంత నిశ్శబ్దంగా విడుదల తేదీని ప్రకటించడం రాజమౌళికే సాధ్యమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా మార్చి 5న ప్రభాస్ నటించిన 'స్పిరిట్' విడుదల కానుంది. ఆ సినిమాపైనా భారీ అంచనాలు ఉన్నాయి. ఒక నెల గ్యాప్‌లో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియన్ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రావడం అరుదైన పరిణామంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## బాలీవుడ్ కు బోయపాటి..

**దురందర్ హీరోతో కథా చర్చలు**



టాలీవుడ్ మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను తదుపరి ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. 'అఖండ', 'అఖండ 2 (తాండవం)' చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద తన మార్క్ చూపించిన బోయపాటి, ఇప్పుడు బాలీవుడ్ వైపు అడుగులు వేయనున్నాడన్న చర్చ మొదలైంది.

తాజాగా బోయపాటి శ్రీను ముంబై వెళ్లి బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్‌ను కలిసినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఒక భారీ యాక్షన్ కథను ఆయన వినిపించారని, దానికి రణవీర్ సింగ్ సానుకూలంగా స్పందించినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ప్రశాంత్ వర్మతో రణవీర్ సినిమా పట్టాలెక్కకపోయిన నేపథ్యంలో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై ఆసక్తి పెరిగినట్టు తెలుస్తోంది.

బోయపాటి చెప్పిన హైవోల్టేజ్ మాస్ సబ్జెక్ట్ రణవీర్‌కు నచ్చిందని, చర్చలు ప్రాథమిక దశలో కొనసాగుతున్నాయని సమాచారం. ఈ సినిమా ఓకే అయితే బోయపాటి కెరీర్‌లోనే అతిపెద్ద అవకాశంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రణవీర్ సింగ్ స్థాయి స్టార్‌తో సినిమా అంటే అది కేవలం బాలీవుడ్‌కే పరిమితం కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ప్రభావం చూపుతుందన్న అంచనాలు ఉన్నాయి. బోయపాటి మార్క్ యాక్షన్, రణవీర్ ఎనర్జీ కలిస్తే వెండితెరపై మాస్ సందడి ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రాజెక్ట్ ఖరారైతే మైత్రీ మూవీ మేకర్స్ లేదా మరో ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని సమాచారం.

## ప్రియాంక సంప్రదాయ అందాలు

మరాఠీ సినిమా, టెలివిజన్ రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి ప్రియాంక ఖోల్గడే మరోసారి వార్తల్లో నిలిచారు. నటనతో పాటు స్టైలిష్ లుక్స్‌తో సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, తాజాగా సంప్రదాయ వస్త్రధారణలో కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు.

ఎథ్నిక్ అవుట్‌ఫిట్‌లో ప్రియాంక ఖోల్గడే చూపించిన అందం, లావణ్యం నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. చీరలైనా, ఇతర సంప్రదాయ దుస్తులైనా సహజమైన హావభావాలతో, క్లాసీ స్టైల్‌తో ఆమె ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. సినిమాలు, టీవీ షోలు, మ్యూజిక్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు పొందిన ప్రియాంక, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కూడా దూసుకుపోతున్నారు. తాజాగా విడుదలైన ఆమె ఎథ్నిక్ ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారగా, అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

నటనతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర వేస్తూ, ప్రియాంక ఖోల్గడే భవిష్యత్తులో మరిన్ని అవకాశాలతో ముందుకు సాగుతారని సినీ వర్గాలు భావిస్తున్నాయి.





## అల్లు అర్జున్–లోకేశ్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి అధికారిక అనౌన్స్‌మెంట్ వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.

ఒక పుస్తకం ఆధారంగా రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ కథ బాక్సాఫీస్‌పై భారీ ప్రభావం చూపుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో అల్లు అర్జున్ సూపర్ నేచురల్ శక్తులు ఉన్న సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నట్టు సమాచారం.

ఇక హీరోయిన్‌గా బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ఎంపికైందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రద్ధా 'ఈట' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. ఇప్పటికే ప్రభాస్ 'సాహో'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు, ఈ ప్రాజెక్ట్ మరింత గుర్తింపు తీసుకురావొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com